Crime News

# ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

బుధవారం, ఆగస్టు 19, 2026 | సంపుటి - 20 | సంచిక 321 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## హరీష్ రావు కాదు..అబద్దాల రావు

### మరోమారు మంత్రి పొంగులేటి విమర్శలు



హైదరాబాద్ : మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. హరీశ్‌రావు కాదు ఆయన అబద్దాల రావు అని ఎద్దేవా చేశారు. 22ఏ లో ఆయన కొండను తవ్వి ఎలుకను పట్టారని.. దాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారని సెటైర్లు గుప్పించారు. మంగళవారం హైదరాబాద్ వేదికగా మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గతంలో సాఫ్ట్ కాపీ అప్‌లోడ్ చేయకపోవడం వల్ల తప్పు జరిగిందని తామే గుర్తించామని అన్నారు. 2లో

## పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

- నిషేధిత జాబితా భూములకు నైతిక బాధ్యత వహించాలి
- సారీలు చెప్పి సరిపుచ్చుకోవడం కుదరదు
- బాధితుల కోసం జనతా గ్యారేజ్ తెరిచే ఉంటుంది
- బిఆర్ఎస్ నేత హరీస్ రావు డిమాండ్



హైదరాబాద్ : మీ భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి విడిపించే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావు ప్రజలకు హామీ ఇచ్చారు. తరువాయి 2లో

## పేదలకు భూమి పంపిణీ అత్యావశ్యకం



- టిఆర్ఎస్ అధికారంలోకి వస్తే భూలక్ష్మి కింద ఎకరం పంపిణీ
- పేదల భూములను లాక్కుంటూ పోతే చూస్తూ ఊరుకోం
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరిక

హైదరాబాద్ : తాము అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పేదల భూములను రేవంత్‌రెడ్డి లాక్కుంటే.. చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్ లోని బంజారా హిల్స్.. టీఆర్ఎస్ కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్రం సామాజిక న్యాయం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. తరువాయి 2లో



## ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

- తాగునీటికే తొలి ప్రాధాన్యం... పంటలకూ భరోసా కల్పించాలి
- అందుబాటులో ఉన్న నిల్వల ఆధారంగానే నిర్ణయాలు
- కృష్ణా బేసిన్‌లో 76.63 శాతం.. గోదావరి బేసిన్‌లో 68.1 శాతం నిల్వలు
- నాగార్జునసాగర్‌లో 164 టీఎంసీల నీరు.. 47 శాతం వరద జలాలకు అవకాశం
- అంతర్రాష్ట్ర జల వివాదాలపై పటిష్ట వాదనకు సమగ్ర కార్యాచరణ
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ఆకాశం వైపు ఆశగా చూడటం ఒక్కటే జల నిర్వహణ కాదు... ఆనకట్టలో ఎంత నీరుంది, అందులో నిజంగా వినియోగించగలిగేది ఎంత, తాగునీటికి ఎంత కాపాడాలి, నిలువునా ఉన్న పంటకు ఎంత అందించగలం అన్న ప్రతి లెక్కలో శాస్త్రీయత, వాస్తవికత ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి కొనసాగుతున్నందున 'తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం... అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ' అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

హైదరాబాద్ : మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి పెద్దఎత్తున వరదలు వస్తాయని ముందుగానే ఊహించుకొని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం చేతిలో ఉన్న నీరే ప్రామాణికం కావాలి... నమ్మదగిన ప్రవాహాలే అంచనాలకు ఆధారం కావాలి... వర్షపాతంపై శాస్త్రీయ విశ్లేషణే నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. మన విధానం సమతుల్యంగా, వివేకవంతంగా ఉండాలి. తరువాయి 2లో

## 22శాతం ఓట్ల తొలగింపు దుర్మార్గపు చర్య

- బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం
- ఇష్టం వచ్చినట్లుగా ఓట్లు తొలగించడం అన్యాయం
- తెలంగాణలో సర్ ప్రక్రియను పొడిగించాలి
- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ డిమాండ్



హైదరాబాద్ : 2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలో ఎన్నికల సంఘాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. తరువాయి 2లో



## కెబిఆర్ పార్క్ చుట్టూ వన్‌వే అమలు

- ఏడాదిన్నరపాటు అమలు కానున్న ఆంక్షలు
- ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణం
- ట్రాఫిక్ సూచనలను పాటించాలన్న సజ్జనార్

హైదరాబాద్ : హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ట్రాఫిక్ అమల్లోకి వచ్చింది. 18న అమల్లోకి వచ్చిన ఈ ప్రక్రియ నుంచి ఏడాదిన్నర పాటు కేబీఆర్ పార్క్ మీదుగా 2లో



## ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

- సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్ గొప్ప యోధుడు
- హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ
- 2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం
- బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు
- ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం
- విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని 2లో

## బిఆర్ఎస్‌తో పోలిస్తే రెండింతలుగా భూ ఆక్రమణలు

### 22ఎ నిషేధిత జాబితా పేరుతో దోపిడీకి స్కెచ్

### రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ ఎంపి ఈటెల రాజేందర్



హైదరాబాద్ : గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాల కంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ రెండింతలు పెరిగిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేసీఆర్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూములు, పరిశ్రమల కోసం ఇచ్చిన స్థలాలు, చివరకు ప్రభుత్వమే లేఅవుట్లు వేసి 2లో

## కొత్త కొబ్బరి మొక్కలు నాటేందుకు చేయూత

- పాడైన వాటికి వేయి చొప్పున పరిహారం చెల్లిస్తాం
- ప్రశ్నోత్తరాల్లో మంత్రి అచ్చన్నాయుడు వెల్లడి



అమరావతి : దేశంలో కొబ్బరి అంటే గుర్తొచ్చే పేరు కోనసీమ అని.. ఆ జిల్లాకు తాను ఇన్‌ఛార్జి మంత్రిగా వ్యవహరిస్తు న్నానని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఏపీ శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కొబ్బరి సాగుకు సంబంధించి ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు అడిగిన ప్రశ్నలకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం ఇచ్చారు. కొబ్బరి సాగులో 10వేల హెక్టార్లలోని కొబ్బరితోటలు కాలం చెల్లినవి ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాలువల్లో తట్టమట్టి కూడా తీయకపోవడం వల్ల సముద్రం నీరు వెనక్కి వచ్చి చెట్లు ఉన్నపళంగా కుంగిపోయిందని చెప్పుకొచ్చారు. 2లో

## స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు ఆమోదం



- గ్రామీణ ప్రాంతాల్లో 34, పట్టణ ప్రాంతాల్లో 33.1 శాతం రిజర్వేషన్లు
- మేయర్ల ఎన్నికలకు ప్రత్యక్ష పద్ధతిలో వెళ్లాలని నిర్ణయం
- ఆర్థికసంఘం నిధులు నష్టపోకుండా సకాలంలో ఎన్నికల నిర్వహణ
- దాదాపు 55కు పైగా అజెండా అంశాలపై కేబినెట్‌లో చర్చ

అమరావతి : స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. అలానే పట్టణ ప్రాంతాల్లో బీసీలకు 33.1 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల హామీ మేరకు బీసీలకు రిజర్వేషన్లను పెంచే అంశంపై ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు చేసిన నేపథ్యంలో కేబినెట్ నిర్ణయంకు ప్రాధాన్యత సంతరించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలను అక్టోబర్‌లోగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.16,500 కోట్ల నిధులు నష్టపోకుండా ఉండేందుకు ఎన్నికలను సకాలంలో నిర్వహించాల్సిన అవసరాన్ని కేబినెట్ పరిగణనలోకి తీసుకుంది. బిసిలకు రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, మేయర్ల ఎన్నికలకు ప్రత్యక్ష పద్ధతిలో వెళ్లాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు తరువాయి 2లో

## హరీష్ రావు కాదు..అబద్దాల రావు

ఆయన ఎత్తు పెరగడం కాదని.. విమర్శలు చేసే ముందు బుర్ర కూడా ఉపయోగించాలని మంత్రి వ్యగ్యంగా మాట్లాడారు. ఎవరికీ అన్యాయం జరగనివ్వోమని అన్నారు. ప్రభుత్వ భూములు కాకపోతే కచ్చితంగా వాటిని 22ఏ నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో మాదిరిగా తాము బుకాయించడం లేదని చెప్పారు. కేంద్రం, ఎన్నికల సంఘం, బీఆర్ఎస్ కలిసి ఓట్లను తొలగించే కుట్రను చేస్తున్నాయని.. వారి పప్పులు ఉడకనివ్వబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు.

## కొత్త కొబ్బరి మొక్కలు నాటేందుకు చేయూత

ప్రతి చెడిపోయిన మొక్కకు వెయ్యి సాయం చేసి కొత్తమొక్కలు పెట్టించాలనే ప్రతిపాదన ఉందన్నారు. డ్రెయిన్‌లు శుభ్రం చేయకపోతే ఎంత పెట్టుబడి పెట్టినా, కొత్త మొక్కలు నాటినా ఫలితాలు ఉండదని మంత్రి తెలిపారు. అందుకే మొదటి దశలో శంకరగుప్తం కాలువ పూడిక తీస్తే రెండు, మూడు నియోజకవర్గాల్లో సమస్య పరిష్కారమవుతుందన్నారు. కొత్త ప్లాంటేషన్‌కు వీబీ జీ రాంజీ పథకం కింద కేంద్రంలోని కోకో బోర్డు ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. మొత్తం ఒక ప్రాజెక్ట్ రూపంలో తీసుకొని కోనసీమలో కొత్తమొక్కలు పెట్టిస్తామమని చెప్పారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చెప్పినట్లు అంతర పంటలు వేయాలని రైతులకు సూచించారు. కొబ్బరితోటల్లో కోకో, అరటి, అంతర పంటలు వేయొచ్చని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు అయ్యేలా చూస్తున్నామని, రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇరిగేషన్ కాల్వలపై ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## కెబిఆర్ పార్క్ చుట్టూ వన్‌వే అమలు

ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాల్సి ఉంటుంది. హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టిన 7 ఫ్లై ఓవర్లు, 7 అండర్ పాస్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకే వన్ వే ట్రాఫిక్ అమలు చేస్తున్నట్టు సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, రోడ్ నెం.45 మీదుగా ఐటీ కారిడార్‌కు వెళ్లే వాహనదారులు.. కేబీఆర్ పార్క్ జంక్షన్ నుంచి బసవతారకం, ఫిల్మ్ నగర్ మీదుగా రోడ్ నెం.45 చేరుకొని అక్కడి నుంచి ఐటీ కారిడార్‌కు చేరుకోవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. హెచ్‌- సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.1300 కోట్ల వ్యయంతో కేబీఆర్ పార్కు చుట్టూ వీటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ పార్కు చుట్టూ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు పార్కు చుట్టూ వన్ వే చేశామని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో చాలామంది ప్రజలు సంతోషిస్తున్నారని తెలిపారు. 'కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే కి సహకారం అందిస్తున్నందుకు అందరికి ధన్యవాదములు. అగ్రసేన్ చౌరస్తా రోడ్ నం 45, చెక్ పోస్ట్, వెంకటగిరి దగ్గర కాస్త ఇబ్బంది కలిగింది. డ్రోన్స్ ద్వారా కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇంకా కొన్ని చోట్ల సూచికలు పెట్టాల్సి ఉంది. సాంకేతికతను ఉపయోగించి ఇంకా ఎటువంటి మార్పులు చేయాలో చూస్తాం. ముఖ్యంగా కొంత మంది సూచనలు పాటించకుండా వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు ఇచ్చే సూచనలు పాటిస్తూ వాహనదారులు ముందుకు వెళ్లాలని సూచిస్తున్నామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

ప్రజల తాగునీటి అవసరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకూడదు. అదే సమయంలో తాగునీటి అవసరాలకు మించి అందుబాటులో ఉన్న నీరు జలాశయాల్లో ఉన్నప్పుడు పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఉండకూడదు. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవంగా వినియోగించగల నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవిక వర్షపాత అంచనాల ఆధారంగానే జరగాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ÷ృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉండి, 76.63 శాతం నిల్వలు నమోదయ్యాయని సమీక్షలో వెల్లడైంది. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు స్థూల సామర్థ్యం సుమారు 312 టీఎంసీలు కాగా, ఇంకా దాదాపు 47 శాతం మేర వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు. అయితే జలాశయాల్లో కనిపించే స్థూల నిల్వ శాతాలను మాత్రమే చూపించి పరిస్థితి ఎంతో ఆశాజనకంగా ఉందన్న భావన కలిగించవద్దని అధికారులను మంత్రి హెచ్చరించారు. స్థూల సామర్థ్యం ఎంత? లైవ్ స్టోరేజ్ ఎంత? వాస్తవంగా వినియోగించగల నీరు ఎంత? ఇప్పటికే కేటాయించిన అవసరాలు ఎంత? వాటన్నింటినీ మినహాయించిన తర్వాత సాగునీటికి మిగిలేది ఎంత? అన్న వివరాలు ప్రతి నివేదికలో స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. 2025, 2026 సంవత్సరాల నిల్వలు, ప్రవాహాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ÷ుగిలిన ఖరీఫ్ కాలంలో ప్రభుత్వం ముందున్న లక్ష్యం స్పష్టమని మంత్రి పేర్కొన్నారు. నమ్మదగిన ప్రతి నీటి వనరును సద్వినియోగం చేసుకొని నిలువునా ఉన్న పంటలను కాపాడాలని, ప్రవాహాలపై అనిశ్చితి ఉన్న జలాశయాల్లో నీటిని జాగ్రత్తగా సంరక్షించాలని, రైతులకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు పారదర్శకంగా తెలియజేయాలని ఆదేశించారు. వైరా రిజర్వాయర్ పరిస్థితిని ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, గోదావరి జలాలతో తిరిగి నింపుకునే అవకాశం ఉన్నప్పుడు సాగునీటి విడుదలలో జాప్యం ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. సహజ ప్రవాహాలపై మాత్రమే ఆధారపడే జలాశయాల్లో నీటిని పొదుపుగా వినియోగించడం అవసరమేనని, కానీ నమ్మదగిన ప్రత్యామ్నాయ వనరుల నుంచి తిరిగి నింపుకునే అవకాశం ఉన్న చోట సాగునీటిని అనవసరంగా నిలిపివేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. దేవాదుల, నిజాంసాగర్, స్వర్ణ, సదర్మట్ ఆనకట్ట, రామడుగు, బుగ్గలవాగు, రామపల్లి, పాలెంవాగు, గౌరవవరం, పోచారం, రాజీవ్ సాగర్, నెలవాయి, వట్టివాగు, నల్లవాగు, పాల్వాయి పురుషోత్తంరావు (ఎర్రవాగు), చెల్మెలవాగు (ఎన్టీఆర్ సాగర్) ప్రాజెక్టుల పరిధిలో అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, సాగునీటి విడుదలకు అవకాశం ఉన్నచోట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మూసీ జలాలను కూడా సమర్థంగా వినియోగించి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో సాగునీటి ప్రణాళికలు జలాశయంలోని వాస్తవ నిల్వలు, వస్తున్న ప్రవాహాలకు అనుగుణంగానే ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. నిజాంసాగర్, లోయర్ మానేరు డ్యామ్, సింగూరు సహా గోదావరి బేసిన్‌లోని ఇతర ప్రధాన జలాశయాల పరిస్థితిని కూడా సమగ్రంగా సమీక్షించారు. సింగూరు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డ్యామ్‌కు అవసరమైన మరమ్మతులు, పటిష్టీకరణ పనులను వేగవంతం చేయాలని, తాజా నీటి నిల్వలను మరోసారి ధ్రువీకరించి సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఇంజినీర్లకు సూచించారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్‌-ఎల్‌బీసీ) సొరంగం పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. ఇన్‌లెట్, అవుట్‌లెట్ రెండు వైపుల నుంచి తవ్వకం కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. భౌగోళికంగా అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో ఇంజినీర్లు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, భద్రత విషయంలో ఎక్కడా రాజీపడకుండా పనుల వేగాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. జలవనరులకు సంబంధించిన అన్ని సాంకేతిక అధ్యయనాల్లో కేంద్ర జల సంఘం, భారత వాతావరణ శాఖ (ఎఓఅ) తాజా సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కాలం చెల్లిన సమాచారంపై ఆధారపడకుండా నదుల క్రాస్ సెక్షన్లను తాజా పరిస్థితులకు అనుగుణంగా నవీకరించాలని సూచించారు. ÷రిళిలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో ఏర్పడే అవకాశం ఉన్న ముంపు ప్రభావంపై అధ్యయనం చేస్తున్న ఐఐటీ నిపుణులతో త్వరితగతిన తదుపరి సంప్రదింపులు జరపాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ భూభాగంలో ఎంతమేర వరద ప్రభావం లేదా ముంపు ఏర్పడే అవకాశం ఉందన్న అంశంపై శాస్త్రీయమైన, తిరుగులేని సాంకేతిక ఆధారాలను సిద్ధం చేయాలని సూచించారు. అవసరమైన రక్షణ చర్యలను కేంద్రం నుంచి కోరేందుకు ఈ అధ్యయనం తెలంగాణకు బలమైన ఆధారంగా నిలవాలని పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై కూడా మంత్రి విస్తృతంగా సమీక్షించారు. ట్రిబ్యునల్‌లో కొనసాగుతున్న విచారణలు, సుప్రీంకోర్టులోని కేసులు, కృష్ణా జలాల నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పరిధి తదితర అంశాలపై ఇంజినీరింగ్, న్యాయ విభాగాల అధికారులు సమన్వయంతో సంక్షిప్తమైనా సమగ్రమైన నోట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. నీరు ప్రకృతి ఇచ్చే సంపద మాత్రమే కాదు... ప్రజల భవిష్యత్తుకు ప్రభుత్వం నిర్వహించాల్సిన బాధ్యత. తాగునీటిని కాపాడాలి... రైతు పంటను నిలబెట్టాలి... రేపటి అవసరాన్ని విస్మరించకుండా నేటి అవసరాన్ని తీర్చాలి. అందుకే ఈ సమయంలో ప్రతి టీఎంసీకి లెక్క ఉండాలి... ప్రతి విడుదలకు శాస్త్రీయ కారణం ఉండాలి... ప్రతి నిర్ణయంలో రైతు ప్రయోజనం, ప్రజల తాగునీటి భద్రత ప్రతిబింబించాలి' అన్న దిశలో అధికారులు పనిచేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్-ఇన్-చీఫ్ (అడ్మినిస్ట్రేషన్) టి. శ్రీనివాస్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (ఓ అండ్ ఎం, క్వాలిటీ కంట్రోల్) ఆర్. మధుసూదన్ రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు రిజిస్ట్రార్ ఆఫీస్ చుట్టూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధంగా, కష్టార్జితంతో సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలంటూ ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిందని, అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని హరీశ్‌రావు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్ పని చేయకపోయినా మా జనతా గ్యారేజ్ అంటే తెలంగాణ భవన్ తలుపులు మీకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని హరీశ్‌రావు అన్నారు. మూసిపరివాహక ప్రాంతంలోని ఇండ్లను హైడ్రా కూలగొట్టే ప్రయత్నం చేసినప్పుడు జనతా గ్యారేజ్ తలుపు తట్టారని, అప్పుడు వాళ్లకు న్యాయం చేశామని అన్నారు. అదేవిధంగా నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల విషయంలో కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని వ్యాఖ్యానించారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములు, హెచ్‌ఎండీఏ అమ్మిన భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. 'మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష అని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు నా చేతిలోకి రావాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తప్పు చేశారు.. సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా? ఇది 30 శాతం గవర్నమెంట్... ఏ పని కావాలన్నా 30శాతం కమిషన్ అడుగుతున్నారని అంటూ విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో ఉందని.. మరి సీఎం ఎక్కడ మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారో చెప్పాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. నిషేధిత భూములతో పాటు ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాల నుంచి తొలగించిన భూముల లిస్టును పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి కలిసి కుట్ర చేస్తున్నారని.. తప్పు వారు చేసి అధికారులపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులూ జాగ్రత్త.. మీరు తప్పు చేస్తే రేపు మీరే బలవుతారు. మీ కమిషన్ల కోసం పెన్ను పోటుతో ప్రజల జీవితాలను బలి చేయొద్దు. రేపు ఎప్పుడు అసెంబ్లీ పెట్టినా నిషేధిత భూములపై ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నిలదీస్తుంది.. ప్రజలకు అండగా ఉంటుంది. ప్రజల ఆస్తులపై మీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తామంటే పాతర వేస్తారు. ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్ పనిచేయట్లేదు... మీ జనతా గ్యారేజ్ తెలంగాణ భవన్ ఎప్పుడూ మీకోసం తెరిచే ఉంటుంది' అని హరీశ్ రావు పేర్కొన్నారు.

## 22శాతం ఓట్ల తొలగింపు దుర్మార్గపు చర్య

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ ఫామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రతి పౌరుడి ఓటు కాపాడాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని అన్నారు. హైదరాబాద్ నగరంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) అనేక ప్రాంతాల్లో ఓటర్ల ఇళ్లకు వెళ్లలేదని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ముఖ్యంగా పేదలు, వలస కూలీల ఓట్లే పెద్ద సంఖ్యలో తొలగించారని విమర్శించారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎలాంటి కారణం లేకుండా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. మొత్తంగా 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు. డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పు కారణంగా 2002 నాటి ఓటర్ల వివరాలతో ప్రస్తుత జాబితాను సరిపోల్చడంలో అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు. 2002 నాటి ఓటర్ల జాబితాతో ముడిపెట్టకుండా అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలని మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. లక్షలాది మంది ఓట్లను తొలగించి ప్రజాస్వామ్య దేశంగా ఎలా చెప్పుకుంటామని మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణ పక్రియలో జరిగిన తొలగింపులపై సమగ్రంగా పరిశీలించి అర్హులైన ఓటర్లకు తిరిగి ఓటు హక్కు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు ఆమోదం

మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విశాఖలో అక్షత్ గ్రీన్‌టెక్ సోలార్ సెల్, మాడ్యూల్ ప్లాంట్, డేటా సెంటర్ల ప్రతిపాదనలకు ఆమోదం ఇచ్చింది తిరుపతి, సూర్యలంక, కేశరపల్లి, కాకినాడలో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు 55కు పైగా అజెండా అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి.. పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలు, మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికలు, పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, మౌలిక వసతులకు సంబంధించిన పలు అంశాలపై కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్లు, ఛైర్మన్ల ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే డిప్యూటీ మేయర్లు, డిప్యూటీ ఛైర్మన్ల విషయంలో పాత విధానాన్ని కొనసాగిస్తూ.. ఒక్కరికి మాత్రమే పరిమితం చేయాలని నిర్ణయించింది. పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించి కూడా కేబినెట్ పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే 12 గిగావాట్ల సిలికాన్ ఇంగాట్, వేఫర్ ఎ÷-లాంట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో అక్షత్ గ్రీన్‌టెక్ ఆధ్వర్యంలో సోలార్ సెల్, మాడ్యూల్ ఎ÷-లాంట్, డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలి తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తిరుపతి, సూర్యలంక, కేశరపల్లి, కాకినాడ ప్రాంతాల్లో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇంధన రంగంలో హైబ్రిడ్, సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. అమరావతి రైల్వే లైన్ కోసం భూసేకరణ, ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించిన అంశంపైనా నిర్ణయం తీసుకుంది. హ్యామ్ మోడల్‌లో రూ.7,469.46 కోట్లతో రోడ్లు, పార్కుల అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించింది. రాష్ట్రంలో మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగాల విషయంలోనూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటించేందుకు ఆమోదం తెలిపింది. బీసీ విద్యార్థుల కోసం జేఈఈ, నీట్ పరీక్షల శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉన్నత విద్యా రంగానికి సంబంధించి ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ ఏర్పాటు చేసే బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రంలోని ఉన్నత విద్యా వ్యవస్థలో మరిన్ని మార్పులకు మార్గం సుగమం కానుంది. ఏపీఎస్‌బీసీఎల్‌కు రూ.5 వేల కోట్ల వర్కింగ్ క్యాపిటల్ రుణం ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అవయవ మార్పిడికి సంబంధించిన ట్రాన్స్‌ఎ÷-లాంటేషన్ బిల్లుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 నీటి ప్రాజెక్టులపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. ఇదిలావుంటే ద్రవ్యోల్బణం పెరుగుతున్నందున ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర మంత్రివర్గం అంజెడా అంశాలు ముగిశాక వివిధ పరిణామాలపై సీఎం చర్చించారు. సోషల్ మీడియాలో వస్తున్న నెగిటివ్ కామెంట్లపై ధీటుగా స్పందించాలని మంత్రులకు సూచించారు. అక్టోబర్‌లోగా స్థానిక ఎన్నికలు జరగకుంటే రూ.12150 కోట్లు అర్బన్ లోకల్ బాడీ నిధులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. న్యాయ పరిధిలో 23 మున్సిపాలిటీల విలీన పక్రియను తర్వాత చూసుకుందామని.. ముందైతే అన్నింటిలోనూ ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు.

## పేదలకు భూమి పంపిణీ అత్యావశ్యకం

తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని భూమిలేని పేదలకు ఎకరం చొప్పున భూమి ఇచ్చేలా 'భూ లక్ష్మి పథకం' అమలు చేస్తామని ఆ పార్టీ అధినేత్రి కవిత ప్రకటించారు. రాష్ట్రంలో భూమి పంపిణీ అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భూమి కేవలం లావాదేవీల అంశంగా కనిపించవచ్చని, అయితే పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి జీవనాధారమని కవిత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా అసైన్డ్ భూములనే తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం తీసుకుందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సోదరులపై కూడా కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. వారి ఆధ్వర్యంలో భూ దోపిడీ జరుగుతోందని ఆరోపిస్తూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనను తీవ్రంగా విమర్శించారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల ప్రభావం ప్రభుత్వంలో కొనసాగుతోందని ఆమె ఆరోపించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి.. గత 31 నెలల్లో ఆ అంశాన్ని ఎందుకు పట్టించుకోలేదని కవిత ప్రశ్నించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే ముందు కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లోనూ బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఒకే రోజు శివధర్‌రెడ్డి, వీహెచ్‌లను సలహాదారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే ఇద్దరి వేతనాల్లో తేడా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఆర్టీఐ కమిషన్‌లో ఒక్క బీసీకి కూడా అవకాశం కల్పించలేదని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నియామకాల్లో సామాజిక న్యాయం పాటించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం కొనసాగుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కవిత సూచించారు.విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి.. మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ ఆచరణలో మాత్రం అటవికా న్యాయమని విమర్శించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే ఒక రకమైన చర్యలు.. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారా ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో రేవంత్ రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. రేవంత్ రెడ్డికి భూమి అంటే కమర్షియల్ ట్రాన్సాక్షన్‌గా మారిపోయిందని ధ్వజమెత్తారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో కూడా మూడు వేల ఎకరాల భూమిని పేదలకు ఇచ్చిందని.. ఆ తర్వాత ఆపేసిందని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న, అన్యాక్రాంతమైన భూములను సేకరించి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి ఇవ్వడం సాధ్యమేనని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి - పదేపదే గతంలో జరిగిన విషయాలనే ప్రస్తావిస్తూ.. చేయాల్సిన పనులను పక్కన పెట్టకూడదని కవిత పేర్కొన్నారు.

## 22న జనసేన ఆత్మయ సమ్మేళనం

### పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా నేతలు

హనుమకొండ ,ఆగస్ట్18 : జనసేన పార్టీ జిల్లా ముఖ్య నాయకులు గాదె పృథ్వీ, పద్మజాదేవి, గడ్డం రాకేష్ మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ముందుగా ఈ నెల 22న హనుమకొండ కేంద్రంగా జరగనున్న ఓరుగల్లు జనసైనికుల ఆత్మీయ సమావేశం పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో జనసైనికులతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు పార్లమెంట్ సెగ్మెంట్ల జనసైనికులతో హనుమకొండ కేంద్రంగా ఈనెల 22 శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో వరంగల్ జిల్లా సమస్యలపై జనసేన పోరాటం చేసిందని, రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం చేస్తూ ప్రజాసమస్యలపై మరింత చురుగ్గా పోరాడుతామన్నారు.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో జనసేన జెండా ఎగరడం ఖాయం అని పేర్కొన్నారు. ఈ ఆత్మీయ సమావేశానికి ప్రతి ఒక జనసైనికుడు హాజరై విజవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నేతలు పలువురు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌తో పోలిస్తే రెండింతలుగా భూ ఆక్రమణలు

విక్రయించిన భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని ఈటల మండిపడ్డారు. దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం వెనుక భూమాఫియాకు అప్పగించే కుట్ర ఉందని ఆరోపించారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసినప్పటికీ భూములను లాక్కునే ప్రభుత్వాల విధానంలో ఎలాంటి మార్పు రాలేదని ఈటల విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు పాల్పడితే.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే భూములను సెటిల్‌మెంట్ చేసుకుంటోందని ఆరోపించారు. గతంలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఖర్చు చేసిన డబ్బులు ఇలాంటి భూ దందాల ద్వారా వచ్చినవేనంటూ ఈటల సంచలన ఆరోపణలు చేశారు. గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూములు ఫీనిక్స్ కంపెనీ ద్వారా ఎలా చేతులు మారాయో అందరికీ తెలుసని ఈటల పేర్కొన్నారు. ఈ వ్యవహారాల్లో పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. పేదలు, రైతులకు అన్యాయం చేస్తూ రియల్ ఎస్టేట్ మాఫియాలకు కొమ్ముకాయడం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భూ అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం కొనసాగుతుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అయితే, ఈ సమావేశంలో ఈటల చేసిన ఆరోపణలపై ప్రభుత్వం లేదా సంబంధిత వర్గాల స్పందన వెలువడాల్సి ఉంది.

## ఉరిశిక్షను రద్దు చేయండి

**ఇతర సులువైన మరణాలను ప్రసాదించండి**

**సుప్రీంలో దాఖలైన పిటిషన్ కొట్టివేత**

న్యూఢిల్లీ : మరణశిక్ష పడిన దోషులను ఉరిశిక్ష నుంచి తప్పించి, సులువుగా మరణించే ప్రక్రియను చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భారతీయ శిక్షా స్మృతిలో భాగంగా కొన్ని కేసుల్లో ఉరి తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉరి వేసి దోషిని చంపే ప్రయత్నాలను ఆపేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఉరికి బదులుగా, మరేదైనా నొప్పిలేని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. కాలం చెల్లిన ఉరి విధానాన్ని బహిష్కరించి, దాని స్థానంలో నొప్పి లేకుండా మరణశిక్షను అమలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. అయితే ఆ పిటీషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇక ఈ కేసులో ఇదే తుది తీర్పు కాదని, భవిష్యత్తులో ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించవచ్చు అని, ఒకవేళ ప్రత్యామ్నాయ మరణాలపై ఏవైనా శాస్త్రీయ ఆధారాలు ఉంటే, దాని ప్రకారం మరణశిక్షను అమలు చేయవచ్చని కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. ప్రస్తుతం రిట్ పిటీషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని, కానీ భవిష్యత్తులో రాజ్యాంగం ధర్మాసనం ఈ విధానంపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంటుందని కోర్టు తెలిపింది. శాస్త్రీయ విధానాల్లో మరణశిక్షను అమలు చేసే అంశంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ పిల్ దాఖలు చేశారు. సీఆర్పీసీలోని సెక్షన్ 354(5) కింద ఉరి ద్వారా మరణశిక్షను అమలు చేసే వారు. అయితే ఆ సెక్షన్‌ను సవాల్ చేస్తూ కోర్టులో పిటీషన్ వేశారు. మరణశిక్ష అమలులో భాగంగా ఉరికి బదులుగా ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వాలని పిటీషనర్ అభిప్రాయపడ్డారు. అనేక దేశాలు ఉరి తీయడానికి బదులుగా ప్రత్యామ్నాయ రీతిలో మరణశిక్షలను అమలు చేస్తున్నాయన్నారు. మరణశిక్ష అమలు రీతిలపై ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి తెలిపారు. విషపూరిత ఇంజెక్షన్ ద్వారా మరణశిక్ష అమలు చేసే విధానం విజయవంతంగా జరగడంలేదని సీనియర్ న్యాయవాది మీనాక్షి ఆరోరా వాదించారు. ఈ అంశంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆ న్యాయవాది కోరారు.

## పెన్షన్ కోసం వయోవృద్ధుల ఎదురుచూపు

**కొత్త ప్రకటనలో అవకాశం లేకపోవడంపై ఆందోళన**

హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు నూతన చేయూత పింఛన్ల మంజూరుకు కసరత్తు ప్రారంభించి, అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. అయితే ఈ నిర్ణయం ఏళ్ల తరబడి పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వేలాదిమంది వయోవృద్ధులకు తీవ్ర నిరాశనే మిగిల్చింది. ప్రస్తుతం ఏడు రకాల పింఛన్లకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తుండగా, వృద్ధాప్య పింఛన్లను ఈ జాబితాలో చేర్చకపోవడం తో వృద్ధుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గతంలో వృద్ధాప్య పింఛను వయోపరిమితిని తగ్గించినప్పటికీ అనేక మంది అర్హులకు అవకాశం దక్కలేదు. ఆన్‌లైన ఐడీలు ఓపెన్ కాకపోవడంతో వేలాది మంది అర్హులైన వృద్ధులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. ప్రభుత్వం మారిన తర్వాతైనా తమకు అవకాశం వస్తుందని భావించిన వయోవృద్ధులకు ప్రస్తుతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వకపోవడంతో వారు ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు.ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం మొదటి విడతగా ఏడు కేటగిరీల వారికి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, పైలేరియా, తలసేమియా, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు మాత్రమే ప్రాధాన్యం కల్పించారు. కొత్త పింఛన్ల దరఖాస్తుకు రకరకాల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి చేయడంతో జిల్లాల్లోని తహసీల్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది. వితంతువులు భర్త మరణ ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వం నుంచి దివ్యాంగుల పింఛను రూ.4016, వితంతు, బీడీ, చేనేత, గీత కార్మికులకు రూ.2016 ప్రతినెలా అందిస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ల దరఖాస్తులకు అవకాశం కల్పించకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన, మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పటికీ ఆ దరఖాస్తుదారులకు నేరుగా పింఛన్ ఇస్తారా లేక మళ్లీ కొత్తగా అప్లై చేసుకోవాలా? అనే అంశంపై స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొంది. అర్హులైన వారు ఈనెల 31లోపు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు లేదా వార్డు ఆఫీసర్లకు తమ దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు.

# నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారం

**ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం**

**24 గంటల్లోనే 34 రిజస్ట్రేషన్లు పూర్తి**

**తప్పును సరిదిద్దుకుంటున్నాం**

**మీడియాతో మంత్రి పొంగులేని వివరణ**



హైదరాబాద్,ఆగస్ట్18 : 22ఏ నిషేధిత భూముల జాబితాలోకి పొరపాటున చేరిన ప్రైవేట్ భూముల సమస్యను పరిష్కరించే ప్రక్రియను వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 24 గంటల్లోనే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4.. మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 22ఏ జాబితా విషయంలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో క్షేత్రస్థాయిలో కొన్ని తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దే ప్రక్రియను ప్రభుత్వం వేగంగా చేపట్టిందని వివరించారు. ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం లేదని పొంగులేటి అన్నారు. పొరపాటు జరిగితే దాన్ని అంగీకరించడం తో పాటు.. దాని వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిష్కరించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన కొన్ని ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు కూడా సాంకేతిక కారణాలతో 22ఏ జాబితాలోకి చేరినట్లు తెలిపారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభించామని, అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించామని మంత్రి వెల్లడించారు. 22ఏ భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పొంగులేటి తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ ప్రతిరోజూ దరఖాస్తులను పరిశీలించనుందని, అర్హత ఉన్న నిజమైన ప్రైవేట్ ఆస్తులను వీలైనంత త్వరగా 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. పేదల హక్కులు, ఆస్తులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు. చట్టబద్ధంగా ఉన్న పేదల భూమిలో ఒక్క అంగుళాన్ని కూడా ప్రభుత్వం తీసుకోదని అన్నారు. ఇది పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. 22ఏ సమస్యను రాజకీయంగా ఉపయోగించుకోవద్దని మంత్రి కోరారు. ప్రజల్లో అనవసరమైన ఆందోళన సృష్టించేలా ఆరోపణలు, ప్రచారం చేయడం సరికాదన్నారు. 'మేం జరిగిన తప్పును అంగీకరించి సరిదిద్దుతున్నాం. ప్రజలను ఇబ్బందుల్లో వదిలేయడం మా ప్రభుత్వ విధానం కాదు' అని స్పష్టం చేశారు. అధికారులపై బాధ్యత నెట్టేసి ప్రభుత్వం చేతులు దులుపుకోదని, సమస్యకు పరిష్కారం చూపించడమే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

## పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

**క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రం**

**పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలకు ఆహ్వానం**

**2035 నాటికి 26,000 మెగావాట్ల సోలార్, 8,000 మెగావాట్ల విద్యుత్ లక్ష్యం**

**హైటెక్స్‌లో 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి**

హైదరాబాద్,ఆగస్ట్18 : తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవాటెల్ లో రెండు రోజుల పాటు జరగనున్న 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ / ఎక్స్ పో 2026'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు మరియు సాంకేతిక నిపుణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు... మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడి దారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవ డానికి మరియు కలిసి ఎదగడానికి మిమ్మల్ని పూర్ణహృదయంతో ఆహ్వానించడానికి ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది' అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే విప్లవాత్మక పక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2035 నాటికి 26,000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి అత్యంత కీలకమైన 'విద్యుత్ నిల్వ' సామర్థ్యాన్ని కూడా భారీగా విస్తరిస్తున్నామని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, ఏఐ నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయబోయే ఏఐ డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12,000 ఇ÷ఎ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను ఇక్కడే తయారు చేసే కంపెనీలకు మూలధన సాయం, ÷ూఉ÷ రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు ÷ఉ-తిఖం÷ూ ద్వారా వేగవంతమైన అనుమతులు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని, తెలంగాణతో కలిసి నడవాలని పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను ఆయన సందర్శించారు. డిప్యూటీ సీఎం వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు.

## ఎసిబికి చిక్కిన టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్

**20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**

హైదరాబాద్,ఆగస్ట్18 : నగరంలోని ఫూల్‌బాగ్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో అవినీతిపై ఏసీబీకి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభావతి.. రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడింది. దీంతో ఆమెను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ప్రభావతిపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే.. తమకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు ఏసీబీ అధికారులు సూచించారు. మరో వైపు అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ సిబ్బందిలో ఎటువంటి మార్పు రావడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. తరచూ ఎప్పుడో అక్కడ.. ఎప్పుడో అప్పుడు లంచం తీసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగులు ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్నారు. తాజాగా ఫూల్‌బాగ్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో అటువంటి ఘటనే చోటు చేసుకుంది.

## ఫర్నీచర్ దుకాణంలో అగ్నిప్రమాదం

**మంటల్లో చిక్కుకుని కార్మికుడు మృతి**

రాజన్నసిరిసిల్ల,ఆగస్ట్18 : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పెద్దూరు శివారులోని మహాలక్ష్మి ఫర్నిచర్ దుకాణంలో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా 3గ ÷ర్ ఇంజన్లతో సిబ్బంది దాదాపు మూడు గంటలకు పైగా శ్రమించి మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో రాత్రి దుకాణంలో నిద్రించిన ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన ఒక కార్మికుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ నాగేంద్ర చారి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డెడ్‌బాడీని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దాదాపుగా 40 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు దుకాణ యజమాని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## మద్యం మత్తులో యువకుడి దారుణ హత్య

**స్నేహితులే హత్య చేసినట్లు పోలీసుల గుర్తింపు**

రంగారెడ్డి,ఆగస్ట్18 : రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో స్నేహితులే అతడిని కిరాతకంగా చంపేశారు. రివర్స్ కేఫ్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు బిహార్‌కు చెందిన అనికేత్‌గా గుర్తించారు. అనికేత్.. తన స్నేహితులు రోహిత్, రాహుల్, అంకిత్‌లతో కలిసి మద్యం సేవించాడు. ఈ సమయంలో స్నేహితుల మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. తీవ్ర ఆగ్రహానికి గురైన రాహుల్.. అనికేత్ తల వెనుక భాగంలో ఐరన్ రాడ్‌తో బలంగా కొట్టాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న యువకుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అనికేత్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణను వేగవంతం చేశారు.

## ఉద్యమకారుల పోరాటం ఆధారంగా వర్గీకరణ

**త్వరలోనే ఉద్యమకారుల గుర్తింపునకు చర్యలు**

**చైర్మన్ డాక్టర్ కె. కేశవరావుతో కమిటీ సభ్యులభేటీ..**

**ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదా,సంక్షేమ విధివిధానాలపై కీలక సమీక్ష**

హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు గారి నివాసంలో కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కీలక భేటీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అమరదీపం వేదికగా 16 రోజుల పాటు 13,000 మందికి పైగా ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, వివిధ జేఏసీలతో నిర్వహించిన విస్తృత సంప్రదింపుల ద్వారా సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తుల ఆధారంగా రూపొందించిన 'చర్చలపై ఒక ముసాయిదా నోట్' పై ఈ సమావేశంలో క్షుణ్ణంగా చర్చించారు. సేకరించిన క్షేత్రస్థాయి సమాచారం ప్రకారం ఉద్యమకారులను క్రింది గ్రూపులుగా గుర్తించే విధానాన్ని కమిటీ ప్రాథమికంగా పరిశీలించింది. మొదటి కేటగిరీ (అమరుల కుటుంబాలు): ఉద్యమ క్రమంలో అమరులైన వారు సుమారు 1400 మంది వరకు సమాచారం ఉండగా, గతంలో కొందరికి మాత్రమే సహాయం అందింది. మిగిలిన అర్హులైన అమరుల కుటుంబాలను గుర్తించి పూర్తి న్యాయం చేయడం. రెండవ కేటగిరీ (గాయపడిన ఉద్యమకారులు): పోలీసు కాల్పుల్లో, లాఠీచార్జీల్లో శాశ్వత అంగవైకల్యం పొందిన వారు మరియు ఆత్మహత్యాయత్నాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు. మూడవ కేటగిరీ (జైలు జీవితం గడిపిన వారు): తొలిదశ (1969), మలిదశ ఉద్యమాల్లో ప్రివెంటివ్ కస్టడీ, రిమాండ్, తీవ్ర జైలు శిక్షలు అనుభవించిన విద్యార్థులు, ఉద్యమకారులు. నాల్గవ కేటగిరీ (కేసులు నమోదైన వారు): నాటి ఉద్యమ సమయంలో క్రిమినల్ కేసులు, బెయిలబుల్/నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు ఎదుర్కొన్న శ్రేణులు. ప్రత్యేక కేటగిరీలు (సంస్థాగత / క్రియాశీలక శ్రేణులు): కేసులు నమోదు కానప్పటికీ.. ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలకంగా పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా ఉద్యమకారులు, ధూమ్-ధామ్ కళాకారులు మరియు వివిధ సంస్థల సభ్యులు. ఉద్యమకారులకు ఈ మూడు విధానాల్లో గౌరవం దక్కాలని కమిటీ స్పష్టం చేసింది. ఉద్యోగులు మరియు వసతి కలిగిన వారు కేవలం 'గుర్తింపు కార్డు / ప్రశంసా పత్రం' ఆశిస్తుండగా.. నిరుపేద, నిరుద్యోగ యువత 250 గజాల ఇంటి స్థలం, నిర్మాణానికి ఆర్థిక సాయం, పెన్షన్, ఆర్టీసీ ఉచిత ప్రయాణం, పిల్లలకు ఉచిత విద్య, స్వయం ఉపాధి రుణాలు కోరుతున్నారు. జార్ఖండ్, ఉత్తరాఖండ్ తరహాలో సంక్షేమ పథకాలకు పూర్తి చట్టబద్ధత కల్పించడంతో పాటు శాశ్వత కమిషన్ లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమీక్ష అనంతరం చైర్మన్ కేకే, కమిటీ సభ్యులు తదుపరి చేపట్టవలసిన చర్యలను ఖరారు చేశారు. ఉద్యమకారులు దరఖాస్తు చేసుకోవడానికి త్వరలోనే అధికారిక వెబ్‌సైట్ / పోర్టల్ ద్వారా అవకాశం కల్పిస్తారు. పారదర్శకమైన ఆన్‌లైన్ దరఖాస్తు నమూనాను సిద్ధం చేయడం జరుగుతంది. శాసనసభ్యులు , శాసనమండలి సభ్యులతో విస్తృత స్థాయి చర్చలు జరపడం. మిగిలి ఉన్న ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులతో సంభాషణలు పూర్తి చేయడం. ఇప్పటివరకు జరిగిన అన్ని చర్చల సమగ్ర నివేదికను, మినిట్స్‌ను రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సమర్పించాలని నిర్ణయించారు.

## పేదల ఇళ్ల నిర్మాణానికి పారిశ్రామిక తోడ్పాటు

**ఇందిరమ్మ ఇళ్లకు రూ.230 కే సిమెంట్ బస్తా**

**సామాజిక బాధ్యతను ప్రశంసించిన మంత్రి పొంగులేటి**

హైదరాబాద్,ఆగస్ట్18 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్ ధరల తగ్గింపుపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ మినహా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే గణనీయ సంఖ్యలో 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేశాం. అలాగే క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ కు శ్రీకారం చుట్టాం. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టడం లేదని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఎంతటి ఆర్థిక భారం పడినా పేదల ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రతి లబ్దిదారుడికి నిర్మాణ పురోగతికి అనుగుణంగా విడతల వారీగా ప్రతి సోమవారం పారదర్శకంగా నిధులను విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ బృహత్తరమైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన సిమెంట్‌ను తక్కువ ధరకే అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు కలిసి పనిచేస్తే తెలంగాణలో గుడిసెలు లేని రాష్ట్రం లక్ష్యాన్ని త్వరితగతిన సాధించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి వర్గం సహకారం అందించాలని పిలుపునిచ్చారు. పేదవాడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయమందిస్తే ప్రభుత్వంతో పాటు పరిశ్రమల యాజమాన్యాలను కూడా చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. మంత్రిగారి విజ్ఞప్తి మేరకు ఒక్కో బస్తాను 230 రూపాయిలకు ఇవ్వడానికి యాజమాన్యాలు అంగీకరించాయి. ఈసందర్బంగా మంత్రి పొంగులేటి యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పరిశ్రమల యాజమాన్యాలతోపాటు హౌసింగ్ సెక్రటరీ వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## 29న రైతు పంచాయితీకి సిద్ధం అవుతున్న పంజాబ్ రైతులు

న్యూఢిల్లీ,ఆగస్ట్18 : ప్రతిపాదిత భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా పంజాబ్ రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా జగ్జీత్ దల్లేవాల్ నేతృత్వంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 29న దేశ రాజధానిలో 'రైతు పంచాయతీ' జరుగనున్నది. కాగా ఆదివారం ఢిల్లీ మార్చ్‌కు బయలుదేరిన వందలాది మంది రైతులను పంజాబ్ వైపున గల ఖానౌరీ సరిహద్ద వద్ద జింద్ పోలీసులు అడ్డుకున్నారు. బారికేడింగ్‌తో ఆ మార్గాన్ని సీల్ చేశారు. జగ్జీత్ దల్లేవాల్ హర్యానా- పంజాబ్ సరిహద్దులోని దాతాసింగ్ వాలా గ్రామం నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వరకు 'కిసాన్ బచావో పాదయాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇది ఆగస్టు 29న రాజధానిలో 'రైతు పంచాయతీ'తో ముగుస్తుందని తెలియజేశారు. క్రిసాన్ మోర్చా ప్రతినిధులకు హర్యానా అధికారులకు మధ్య జరిగిన మూడు రౌండ్ల చర్చలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

# సంపాదకీయం

## ముష్కరుల కదలికలపై కన్నేయాలి!

గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన వెనక ల్‌ఖైదా అనుబంధ సంస్థల ప్రమేయం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి కూడా దీనిని గుర్తించింది. భారత్‌లో దాడులకు అల్‌ఖైదా పథకాలు రచిస్తోందని, అనుబంధ సంస్థలను పూ÷–రోత్సహిస్తోందని అంటున్నారు. ఢిల్లీ ఎర్రకోట ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. ఎన్‌ఎస్‌జీ, ఎన్‌ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటికిమొన్న పహల్గామ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. తరవాత ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇస్లామిక్ టెర్రరిస్టులు లక్ష్యం భారత్ దాడులు జరిగిన ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. ఈ విషయంలో వారికి గట్టి బుద్ధి చెప్పకపోతే దేశం మరిన్ని దాడులకు గురికాక తప్పదు. ఇదిలావుంటే పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ హిందువులపై అక్కసు వెళ్లగక్కారు. దేశ విభజన సమయంలో దాదాపు 30 శాతంగా ఉన్న హిందువులు ఇప్పుడు 3 శాతానికి పడిపోయారు. బెదిరింపులు, ఒత్తిళ్లతో మతమార్పిళ్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. పాక్‌లో ఇప్పుడున్న 3శాతం మంది హిందువుల ను పాక్ ముస్లింలు భరించే స్థితిలో లేరని జర్దారీ చేసిన వ్యాఖ్యలు మనకు ఓ హెచ్చరిక లాంటివి. ఈ క్రమంలో ప్రతి ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉండడంతో పాటు, నిరంతరం అది ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూనే ఉంది. ఇటీవవల పాక్‌కు చెందిన మాజీమంత్రి ఒకరు లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్‌కు శిష్యుడినని ప్రకటించుకున్నారు. ఇవన్నీ కూడా తేలికగా తీసుకోరాదు. కేవలం ఆపరేషన్ సిందూర్‌తో ఇది సమిసి పోలేదని గుర్తించాలి. ఎప్పటికప్పుడు దాడుల ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు భారత్‌కు సవాల్ విసురుతూనే ఉన్నారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి కదలికలను ప్రజలు కూడా గుర్తించాలి. మన పక్కన ఎవరు ఏం చేస్తున్నారో కన్నేసి ఉంచాలి. ఎందుకంటే మత మార్పిళ్లు, దాడులు ఆయుధంగా ఇస్లామిక్ ఉగ్రవాదులు నిరంతరం పంజా విసురుతూనే ఉన్నారు. పుణెలో టిఎసిఎస్ కంపెనీలో మతమార్పిడికి ఎలాంటి కుట్రలు చేశారు చూశాం. ఇవన్నీ ఓ పద్దతి ప్రకారం జరుగుతున్నాయి. ఇలాంటి ముష్కరులకు మనదేశంలో ఉండే స్థానం లేకుండా చేయాలి. పుల్వామా దాడి తరవాత పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఏదో రకంగా ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదులతో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు. ఇకపోతే గతంలో ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్ లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండడం మంచిది. ఎవరు ఎలా ఉంటున్నారో గుర్తించాలి. వారి నయవంచక మాటలకు నమ్మి పోసపోవద్దు. ముఖ్యంగా ఎక్కడెక్క ఇస్లామిక్ తీవ్రవాదులు ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయిలో ప్రజజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా వస్తూ పోతున్న వారి కదలికలను గుర్తించాలి. ఎవరు ఎక్కడికి వెళు తున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా అధికారుల బాధ్యతలను భుజాన వేసుకోవాలి. దుర్ఘటనలు జరిగిన తరవాత చింతించే బదులు అనుమానంతో మన పనులు మొదలు పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకోకుండా మనమంతా నిత్యజాగరూకతతో ఉండడం అలవర్చుకోవాలి. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో..ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య వృత్తిలో ఉన్నవారు కూడా మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణ్యాలు తీయడం ఓ లెక్క కాదని గతంలో రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థలు వేటాడుతూనే ఉన్నాయి. పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం వివిధ రూపాల్లో మనపై నిరంతరం దాడులకు పురమాయిస్తోంది. ఈ దేశంపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు మనదేశం ఏమయినా ఫర్వాలేదు..తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమూలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా...ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, మెట్రో స్టేషన్లలో ప్రజలే అనుమానంతో పరిశీలన చేయాలి. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం.

# ఆధార్ మనది.. కోట్లు వాళ్లవి!




వస్తు సేవల పన్ను(జిఎస్‌టి) దేశ ఆర్థిక వ్యవస్థలో పారదర్శకత, పన్నుఎగవేతకు అడ్డుకట్ట, వ్యాపార లావాదేవీల క్రమబద్ధీకరణ వంటి లక్ష్యాలతో తీసుకొచ్చిన కీలక సంస్కరణ. డిజిటల్ వ్యవస్థ ద్వారా వ్యాపార లావాదేవీలను పర్యవేక్షించే అవకాశం పెరిగింది. అయినప్పటికీ, అదే డిజిటల్ వ్యవస్థలోని లోపాలను ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్లు కోట్ల రూపాయల జిఎస్‌టి మోసాలకు పాల్పడుతున్నారన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఈ మోసాలకు సామాన్యుల ఆధార్, పాన్, బ్యాంకు ఖాతాలు, బయోమెట్రిక్ వివరాలను ఉపయోగించి వారినే నకిలీ సంస్థల యజమానులుగా చూపించడం మరింత ప్రమాదకరం. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఘటనలు చూస్తే మోసగాళ్ల వ్యూహం ఎంత పకడ్బందీగా ఉందో అర్థమవుతుంది. పేదలు, చిన్న వ్యాపారులు, పండ్ల వ్యాపారులు, లారీడ్రైవర్లు వంటి వారికి కొంత డబ్బు ఇస్తామని చెప్పి వారి వ్యక్తిగత పత్రాలను తీసుకోవడం, వాటి ఆధారంగా సంస్థలను నమోదు చేయడం, జిఎస్‌టి నంబర్లు పొందడం, నకిలీ కొనుగోలు– అమ్మకాల బిల్లులు సృష్టించడం, ఆ బిల్లుల ఆధారంగా భారీ మొత్తంలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి)ను క్లెయిమ్ చేయడం వంటి అక్రమాలు జరుగుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. బాధితుడికి అసలు విషయం తెలియకుండానే అతని పేరు మీద కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు రికార్డుల్లో నమోదవుతున్నాయి. ఇక్కడ అసలు ప్రశ్న ఒక్కటే –ఒక సామాన్యుడి పేరుతో కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంటే సంబంధిత వ్యవస్థలకు అది ఎందుకు అనుమానాస్పదంగా కనిపించదు? వ్యక్తి ఇప్పటివరకు చిన్న స్థాయి జీవనోపాధిలో ఉంటూ అకస్మాత్తుగా కోట్ల రూపాయల టర్నోవర్ ఉన్న వ్యాపార సంస్థకు యజమానిగా మారితే, అది సహజమైన పరిణామమా? ఒక లారీ డ్రైవర్ లేదా చిన్న వ్యాపారి పేరుతో కొద్ది నెలల్లోనే కోట్ల రూపాయల కొనుగోళ్లు, అమ్మకాలు నమోదైతే, ఆ లావాదేవీల వెనుక నిజమైన వ్యాపారం ఉందా లేదా అన్నది డిజిటల్ వ్యవస్థ గుర్తించలేదా? ఇలాంటి అసాధారణ లావాదేవీలను ముందుగానే గుర్తించడానికి జిఎస్‌టి వ్యవస్థలో ప్రమాద ఆధారిత హెచ్చరికలు ఉండాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ జిఎస్‌టి వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశం. వ్యాపారి తన కొనుగోళ్లపై చెల్లించిన పన్నును, అమ్మకాలపై చెల్లించాల్సిన పన్నునుంచి మినహాయించుకునే అవకాశం దీనివల్ల ఉంటుంది. ఇది నిజమైన వ్యాపారానికి పన్ను భారాన్ని తగ్గించే సమర్థవంతమైన విధానం. కానీ నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి అసలు కొనుగోళ్లు జరగకపోయినా ఐటిసి పొందడం మొదలైతే ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం కలుగుతుంది. ఒక నకిలీ బిల్లు మరొక నకిలీ బిల్లుకు ఆధారమై, చివరకు కోట్ల రూపాయల పన్ను మోసంగా మారే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్యుల గుర్తింపు వివరాలు మోసగాళ్ల చేతికి చిక్కడం మరింత ప్రమాదకరం. ఆధార్, పాన్, బ్యాంకు ఖాతా వివరాలు, మొబైల్ నంబర్, బయోమెట్రిక్ వంటి సమాచారాన్ని ఒకసారి ఇతరుల చేతుల్లో పెట్టిన తర్వాత దాని దుర్వినియోగాన్ని అడ్డుకోవడం కష్టం. కొద్దిపాటి డబ్బు కోసం తమ పత్రాలను అప్పగించిన వ్యక్తి, ఆ తర్వాత తన పేరుతో జరిగిన కోట్ల రూపాయల లావాదేవీలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి రావచ్చు. డిజిటల్ పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుని మోసగాళ్లు వారి అవసరాలను ఉపయోగించుకుంటున్నారు. కొంత డబ్బు ఇస్తాం, మీ పత్రాలు కావాలి, మీ పేరుతో కంపెనీ నమోదు చేస్తాం, బ్యాంకు ఖాతా ఉపయోగిస్తాం వంటి మాటలకు మోసపోయే అవకాశం ఉంది. అయితే ఒక వ్యక్తి నిర్లక్ష్యంగా తన పత్రాలను ఇచ్చాడని చెప్పి మొత్తం బాధ్యతను అతని మీదే మోపడం న్యాయసమ్మతం కాదు. నిజమైన నేరస్థుడు ఎవరు? లాభం పొందింది ఎవరు? సంస్థను నడిపింది ఎవరు? లావాదేవీలను నిర్వహించింది ఎవరు? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. ప్రభుత్వానికి కూడా ఇందులో కీలక బాధ్యత ఉంది. జిఎస్‌టి రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం అవసరమే. కానీ సులభతరమైన వ్యవస్థను మోసగాళ్లు దుర్వినియోగం చేయకుండా భద్రతా ప్రమాణాలను కూడా సమాంతరంగా బలోపేతం చేయాలి. కొత్తగా జిఎస్‌టి రిజిస్ట్రేషన్ తీసుకున్న సంస్థకు అసాధారణంగా భారీ టర్నోవర్ కనిపిస్తే ఆటోమేటిక్ రిస్క్ అలర్ట్ రావాలి. వ్యాపారం జరుగుతున్న ప్రదేశం, బ్యాంకు లావాదేవీలు, ఇన్వాయిస్ నమూనాలు, కొనుగోలు– అమ్మకాల పరస్పర సంబంధం వంటి అంశాలను డేటా అనలిటిక్స్ ద్వారా పరిశీలించాలి. ఒక వ్యక్తి వృత్తి, ఆదాయం, గత వ్యాపార చరిత్రకు పూర్తిగా విరుద్ధంగా కోట్ల రూపాయల లావాదేవీలు కనిపిస్తే, దానిని సాధారణ లావాదేవీగా పరిగణించడం కంటే ముందుగా ధ్రువీకరించడం మంచిది. ఉదాహరణకు చిన్న స్థాయి కార్మికుడు లేదా డ్రైవర్ పేరుతో అకస్మాత్తుగా రూ. 20 కోట్లు, రూ. 30 కోట్లు టర్నోవర్ నమోదైతే వ్యవస్థలో ప్రత్యేక పరిశీలన ప్రారంభం కావాలి. ఇది నిజమైన వ్యాపారం అయితే ఆ వ్యాపారికి ఇబ్బంది ఉండదు; నకిలీ సంస్థ అయితే మోసం ప్రారంభ దశలోనే బయటపడుతుంది. జిఎస్‌టి సంస్కరణ లక్ష్యం నిజాయితీగా పన్ను చెల్లించే వ్యాపారులకు ఇబ్బంది కలిగించడం కాదు; పన్ను ఎగవేతను అరికట్టడం. అందుకే భవిష్యత్తులో నకిలీ సంస్థలపై కఠిన చర్యలు, నకిలీ ఇన్వాయిస్‌లపై వేగవంతమైన విచారణ, అనుమానాస్పద ఐటిసి క్లెయిమ్‌లపై తక్షణ నిలుపుదల, గుర్తింపు దుర్వినియోగానికి గురైన సామాన్యులకు రక్షణ– ఈ నాలుగు అంశాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. సాంకేతికత నేరస్థులకు ఆయుధంగా మారకూడదు. అది సామాన్యుడికి రక్షణ కవచంగా మారాలి. ఒక వ్యక్తి పేరుతో కోట్ల రూపాయల మోసం జరిగితే ముందుగా ఈ నేరం ఎవరు చేశారు? అని వ్యవస్థ ప్రశ్నించాలి; ఈ పేరు ఎవరిది? అని మాత్రమే కాదు. సామాన్యుడి ఆధార్ నంబర్ మోసగాడి ఆయుధంగా మారి, అతని పేరు మీద కోట్ల రూపాయల బిల్లులు పుట్టి, చివరకు అతడే నిందితుడిగా నిలబడే పరిస్థితి రాకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత. జిఎస్‌టి వ్యవస్థలో సంస్కరణల తదుపరి దశ–పన్ను వసూలు మాత్రమే కాదు, పన్ను మోసాల నుంచి సామాన్య పౌరుడి రక్షణ కూడా కావాలి.

## నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

### ప్రధాని మోడీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్

న్యూఢిల్లీ : ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కనన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోడీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతూనే ఉంది. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. తను దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తను నిజమైన దేశభక్తుడినని.. బీజేపీకి భయపడేవాడిని కాదని అన్నారు. 80వ స్వాతంత్య్ర వేడుకల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. దేశంలో ఆయుధాలు పట్టి అడవుల్లో ఉండే నక్సల్స్ ను అంతం చేశామని.. దిమాగీ నక్సల్స్ హింసను ప్రేరేపించేందుకు ఎదురు చూస్తున్నారని.. సమాజాన్ని తప్పుడు దోవ పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ల్గ÷ర్యంగా ప్రశ్నించే వారు దిమాగీ నక్సల్స్.. ఎవరైతే బీజేపీకి భయపడకుండా ప్రశ్నిస్తారో వాళ్లంతా మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్ , అంబేద్కర్ ఇప్పటికీ బతికే ఉంటే.. వాళ్లను కూడా ప్రధాని మోదీ.. దిమాగీ నక్సల్స్ అనేవారేమోనని మండిపడ్డారు. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి లేని సమాజం, ప్రజలకు సౌకర్యాలు, హాస్పిటల్స్ స్కూల్స్, , డ్రైనేజీ సిస్టమ్ మొదలైన వాటిపై ప్రశ్నించే వారు మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్సేనా అని ప్రశ్నించారు. నేను నిజమైన దేశ భక్తుడిని అందుకే నేను దిమాగీ నక్సల్.. అంటూ చెప్పుకొచ్చారు.



## దిమాగీ నక్సల్స్..మరో పార్టీ పుట్టుక

### ప్రధాని నోట మాటరావడం ఆలస్యం.. సోషల్ మీడియాలో ఉత్పన్నం

న్యూఢిల్లీ,ఆగస్ట్18 : కాక్రోచెస్ అంటూ సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కాక్రోచ్ జనతాపార్టీ పుట్టుకు వచ్చింది. ఇటీవల ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద తన సత్తా చాటింది. ఇప్పుడు ఇలాంటిదే మరో పార్టీ పుట్టుకు వచ్చింది. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించామని.. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగిలారంటూ ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ వ్యాఖ్యల ఆధారంగా కొత్తపార్టీ పుట్టుకువచ్చింది. మోదీ ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షలమంది, ఎక్స్‌లో 7000 మంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో దిమాగి నక్సల్ జనతా పార్టీ అనే పేరుతో ఖాతాలు తెరిచారు. యువత ప్రశ్నించడమే కాదు, సమస్యలకు పరిష్కార మార్గాలను కూడా వెతకాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐఐటీ ఢిల్లీ యాభై ఏడవ స్నాతకోత్సవంలో చేసిన వ్యాఖ్యల సంగతి ఎలా ఉన్నా యువత ప్రశ్నిస్తూనే ఉంది. సమస్యలకు పరిష్కరాం చూపాలని ప్రధాని మోడీ అనడం చూస్తుంటే..పాలకులు ఎందుకన్న ప్రశ్న ఉదయిస్తోంది. నిజానికి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? అధికారంలో ఉన్న పాలకులదాకాదా అన్నది తేల్చాలి. 2014లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు యువతకు ఎన్నో ఆశలు కల్పించింది. ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, తయారీ రంగం విస్తరణ, పెట్టుబడుల పెంపు, అవినీతి నిర్మూలన, నల్లధనాన్ని వెనక్కి రప్పించడం వంటి అంశాలపై ఎన్నో హామీలు ఇచ్చారు. అవన్నీ మరచిపోవడం మోడీకి తగదు. ఇవన్నీ పక్కన పెట్టి దిమాగీ నక్సల్స్ అని మేధావులను దూషించడం కూడా సరికాదు. ఇప్పటివరకు యువతకు ఎన్ని ఉద్యోగాలు వచ్చాయంటే.. చెప్పలేం. ఆందోళనలు చేస్తున్న యువతను చూసైనా పాలకులు కళ్లు తెరవాలి. పేపర్ లీకేజీలతో విద్యార్థుల ఆశలపై నీల్లు చల్లడం వల్లనే కదా యువత ఆందోళన బాట పట్టింది. నీట్ వివాదం ఈ పరిస్థితికి ఒక ఉదాహరణ మాత్రమే. విద్యార్థులు నెలల తరబడి ఆందోళనలు చేస్తే, వారి సమస్యలను వినడం, విచారణ జరిపించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం లాంటి పనులను ప్రభుత్వం చేయడంలేదు. పైగా నిరసనకారులకు 'పరిష్కారం మీరే చూపండి' అని చెప్పడం ద్వారా ఏం సందేశాన్ని ఇవ్వదలుచుకున్నారో మేడీ చెప్పాలి. ఈ చర్య నిశితంగా పరిశీలిస్తే ప్రభుత్వం పాలనా బాధ్యతలు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. పరిష్కారం చూపాలంటే ముందు యువతకు అధికారంలో భాగస్వామ్యం కల్పించాలి. నిజానికి యువత కోరుతున్నది కూడా ఈ దేశ అభివృద్ధిలో తమను కూడా భాగస్వాముల్ని చేయమని, తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించమని అంటున్నారు.

## ధ్యానంతో నిత్యనూతనత్వం

తిరుమల : మన శరీరంలోకి అధిక మొత్తంలో ప్రాణశక్తిని చేర్చే ఏకైక మార్గం ధ్యానం, యోగాయే... అందుకే భారతీయ ఋషులు ధ్యానం, యోగ మార్గాన్నే అనుసరించారు.రోజూ కనీసం అర గంట... ధ్యానం, యోగ చెయ్యండి... ఆరోగ్యంగా జీవించండని తెలిపారు. అలాగే నెగెటివ్ థాట్స్‌కు దూరంగా ఉండాలి. అలా ఉంటేనే మన అవయవాలు సరిగా పనిచేస్తాయి. లేకుంటా వాటిపై ప్రభావం పడి అవి పనిచేయకుండా చచ్చుపడతాయి. మన శరీరం లోకి వెళ్లిన ఆహారం 24 గంటల్లో... మలినంగా బయటికి వెళ్లిపోవాలి. లేకపోతే ఆ మలినాలు జబ్బులకు కారణం అవుతాయి. .మన శరీరం లోకి వెళ్లిన నీరు 4 గంటల్లో బయటికి వెళ్లిపోవాలి, లేకపోతే జబ్బులు తప్పవు. మన శరీరంలోకి వెళ్లిన గాలి ఒక నిముషంలోగా బయటికి వెళ్లిపోవాలి లేకపోతే మనం రోగ గ్రస్థులం అవుతాం. మరి మనలోకి చేరిన కోపం, అసూయ, ద్వేషం, మోసం... ఇలాంటివన్నీ సంవత్సరాలుగా మనలోనే ఉంటే... ఏమౌతుందో తెలుసా... మనం నిత్య రోగగ్రస్తులుగా అవుతాం.అందుకే ఋషులు అంటారు... 'మనం రోజూ జీవిస్తున్నాం అని అనుకుంటున్న మూర్ఖులం... నిజానికి మనం రోజూ కొద్దీ కొద్దీగా మరణిస్తున్నాం. మనకు వయసు పెరిగితే... ఆయుష్షు తగ్గినట్టా? పెరిగినట్టా?... మనం ప్రతి రోజూ... నెగెటివ్ ఎనర్జీ లతో కొద్ది కొద్దిగా మరణిస్తున్నామన్న చేదు నిజాన్ని త్వరగా గ్రహించాలి. మనలో చేరి బయటికి వెళ్లిపోకుండా తిష్ట వేసుకొని... మన జీవితాల్ని మృతప్రాయం చేస్తున్న కోపాన్ని, ఒత్తిడిని, ద్వేషాన్ని, బద్ధకాన్ని, అనారోగ్యాన్ని ప్రతి రోజూ ధ్యానం, యోగ చెయ్యడం ద్వారా ప్రాణశక్తిని ఎక్కువగా పొంది నెగెటివ్ ఎనర్జీ దూరం చెయ్యాలి.



ఆధ్యాత్మికం

# గ్రీన్ ఫీల్డ్ హైవేకు ఆటంకాలు లేకుండా చర్యలు

**- టైటిల్ క్లియర్ ఉన్న రైతులకు పరిహారం చెల్లింపులు పూర్తి చేయాలి - పోతారం గ్రామంలో నేషనల్ హైవే నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష**





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మంచిర్యాల--వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ముత్తారం తహసిల్దార్ కార్యాలయంలో నేషనల్ హైవే నిర్మాణ పనుల పురోగతి, భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మంచిర్యాల--వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులకు సంబంధించి నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల సమస్యల కారణంగా క్షేత్రస్థాయిలో పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నట్లు నేషనల్ హైవే అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.పోతారం, సర్వారం, ఓడేడు, లక్కారం ప్రాంతాలకు చెందిన రైతులు, నిర్వాసితులతో సమావేశంలో చర్చించిన కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టైటిల్ క్లియర్‌గా ఉన్న రైతులకు సంబంధించి పరిహారం చెల్లింపుల ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.నేషనల్ హైవే నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపులు తదితర అంశాల్లో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను రైతులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశించారు.రైతులు, నిర్వాసితులకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, సమస్యల కారణంగా జాతీయ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.రైతులకు నేషనల్ హైవే నిర్మాణానికి సంబంధించిన సమస్యలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.అనంతరం ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో జరుగుతున్న నేషనల్ హైవే నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు, నిర్వాసితులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ నిర్మాణ పనులు సజావుగా కొనసాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మంథని ఆర్డిఓ సురేష్, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్, ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, సంబంధిత అధికారులు, పోతారం, సర్వారం, ఓడేడు, లక్కారం ప్రాంతాల రైతులు, నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ భూ సేకరణను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

- పెద్దపల్లి బైపాస్ రోడ్డు, కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి భూ సేకరణ వేగవంతం చేయాలి
- అక్టోబర్ 15 వరకు కునారం ఆర్ఓబి పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములతో కలిసి అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ భూ సేకరణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి బైపాస్ రోడ్డు, కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, తదితర అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భూ సేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని సూచించారు.భూ యజమానులకు సంబంధించిన సమస్యలు, భూ వివరాల పరిశీలన, రికార్డుల పరిశీలన, పరిహారం చెల్లింపులు తదితర అంశాలను వేగవంతం చేయాలని తెలిపారు. అభివృద్ధి పనులకు భూ సేకరణ కీలకమైనందున, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణీత లక్ష్యాల మేరకు పురోగతి సాధించాలని అధికారులను ఆదేశించారు.భూ సేకరణ సజావుగా జరిగేలా అవసరమైన చోట భూ యజమానులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనుల పురోగతికి భూ సేకరణ కారణంగా ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కూనారం ఆరోబీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ అక్టోబర్ 15 నాటికి రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి చేసి వాహనాల రాకపోకలు జరిగే విధంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈ ఈ. భావ్ సింగ్ , రెవెన్యూ డివిజనల్ అధికారులు బి. గంగయ్య, సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు





**కూకట్ పల్లి ఆగస్ట్ 18 (ది క్రైమ్ న్యూస్):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కూకట్ పల్లి, బాలాజీనగర్, మూసాపేట్ తో పాటు పలు డివిజన్ లలో గౌడ సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం సభ్యుల ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నేత వద్దేపల్లి రాజేశ్వరరావు కార్యక్రమాల్లో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు కి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం వద్దేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, అణగారిన వర్గాల నుంచి ఎదిగి, సామాన్య ప్రజలనే తన పోరాట శక్తిగా మలుచుకుని తెలంగాణ నేలపై స్వీయ పాలనకు పునాది వేసిన అసాధారణ ప్రజా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. సుమారు మూడున్నర శతాబ్దాల క్రితమే సామాజిక అసమానతలు, దోపిడీ, ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజల ఆత్మగౌరవం కోసం పాపన్న గౌడ్ పోరాడారని ఆయన పేర్కొన్నారు. సామాన్యుడిగా ప్రారంభమై నాయకుడిగా, యోధుడిగా, పాలకుడిగా ఎదిగి తన కాలంలోని అధికార వ్యవస్థను సవాలు చేసిన ప్రజా వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. పాపన్న గౌడ్ ఒక వ్యక్తి మాత్రమే కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక తిరుగుబాటు అని వద్దేపల్లి రాజేశ్వరరావు తెలిపారు. ఆయన ధైర్యం, ప్రజా సంక్షేమ దృక్పథం, సమానత్వ భావన నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మందుబాబులకు అడ్డాగా మారిన రైతు వేదిక

**నివారించాలని కోరుతున్న క్లస్టర్ పరిధిలోని రైతులు రైతులు**




**కందుకూరు ఆగస్టు 18, (ది క్రైమ్ న్యూస్):** రైతులు వాడుకోవాల్సిన రైతువేదికను మందుబాబులు దర్జాగా వాడుకుంటున్నారు. కందుకూరు మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో ఉన్న రైతు వేదిక పరిసరాల్లో మందుబాబులు దర్జాగా చీకటి అయిందంటే చాలు పర్మిట్ రూమ్ లాగా వాడుకొని దర్జాగా సిసలు అలాగే వదిలేసి వెళ్లడంతో రైతు వేదిక క్లస్టర్ ఏఈ తో పాటు రైతులు సమావేశాలు ఏర్పాటు చేసే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందుబాబులకు మద్యం మితిమీరితే మద్యం సీసాలను పగలగొట్టి విచ్చలవిడిగా పడేసి వెళ్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పగిలిపోయిన సీసాలను తీసివేసే క్రమంలో గాయాలైన సందర్భాలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనుండి అయినా రైతు వేదిక పరిసరాల్లో మద్యం సేవించకుండా ఆకస్మికంగా పెట్రోలింగ్ పోలీసులు తనిఖీ నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. అలాగే గ్రామపంచాయతీ తరఫున కూడా మందుబాబులను హెచ్చరించాలని రైతులతో పాటు రైతు వేదిక క్లస్టర్ అధికారి కోరుతున్నాడు.

**"రైతు వేదికలో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటాం"**



రైతు వేదిక ప్రాంతంలో ఇష్టానుసారంగా మద్యం సేవిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చింది. ఎట్టి పరిస్థితుల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దు ఇకనుండి రైతు వేదిక పరిసరాల్లో ఎవరైనా సరే మద్యం సేవిస్తే గ్రామపంచాయతీ తరఫున కఠిన చర్యలు తీసుకుంటాం, రైతువేదిక పరిసరాల్లో మద్యం సేవించి నట్టు కనిపిస్తే గ్రామపంచాయతీ తరఫున పోలీసులకు సమాచారం ఇస్తాం. **పులిమామిడి గ్రామ సర్పంచ్ ఎంబడి రమేష్**

# ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్' పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జె.రంగారెడ్డి**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం, బీసీ సంక్షేమ శాఖ ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకాన్ని ప్రారంభించిందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జె.రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా బీసీ నిరుద్యోగ మహిళలకు 100% సబ్సిడీతో (యూనిట్ ధర: రూ. 12,000/ ఆటోమేటిక్ కుట్టు మిషన్‌ను అందించి, వారిని ఆర్థికంగా ప్రోత్సహించడం పథకం యొక్క ముఖ్య ఉద్దేశమని, 18 సంవత్సరాల నుండి 55 ఏళ్ల వయస్సు గల బీసీ మహిళలు అర్హులని, రేషన్ కార్డు కలిగి ఉండి ,వార్షిక కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2లక్షలకు మించరాదని, ఆసక్తిగల అభ్యర్థులు సెప్టెంబర్ 15 లోపు ఆన్‌లైన్ ద్వారా పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఒక కుటుంబానికి ఒక యూనిట్ మాత్రమే మంజూరుచేయబడుతుందని, ప్రాథమిక అక్షరాస్యత కలిగి ఉండాలని, దరఖాస్తులు అధికంగా వచ్చిన పక్షంలో కనీసం 5వ తరగతి ఉత్తీర్ణతకు ప్రాధాన్యత ఉంటుందని, మేరా / మేరు కమ్యూనిటీకి, వితంతువులు, నిరాశ్రయులు, ఒంటరి మహిళలు, అనాథలు, కుట్టు పనిలో నైపుణ్యం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు.?దరఖాస్తులు సంబంధిత ధృవపత్రాల పరిశీలన కొరకు ఎంపీడీఓ / మున్సిపల్ కమిషనర్ / జోనల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని, ?ఆసక్తి గల అర్హులైన మహిళలు గడువు తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

# అర్ధరాత్రి హాస్టల్ నుండి విద్యార్థి అదృశ్యం

**ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



**మహేశ్వరం ఆగస్టు 18, (ది క్రైమ్ న్యూస్):** మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థి హాస్టల్ నుండి అదృశ్యమైయ్యాడు. సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, స్టేషన్ కొత్తూరు మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన కీర్తిశేషులు, కుమ్మరి సుభాష్ కుమారుడు కుమ్మరి చరణ్ తేజ (17) తల్లిదండ్రులు లేకపోవడంతో తన మేనమామ దగ్గరే ఉండేవాడు. గత నెల జూన్ నుండి మహేశ్వరం గేట్ సమీపంలోని ఎం జె పి బీసీ వెల్ఫేర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ చదువుతున్నాడు. ఈనెల 16వ తేదీ రాత్రి నైట్ డ్యూటీ లో ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులకు అటెండెన్స్ తీసుకున్న సమయంలో హాస్టల్లోనే ఉన్నాడు. అనంతరం అర్ధరాత్రి వాష్ రూమ్ కి వెళ్ళిన విద్యార్థి తిరిగి రాలేదు వాష్ రూమ్ కే వెల్లుండొచ్చులే అనుకున్న ఎంతటికి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు పరిసరా ప్రాంతాల్లో వెతికినప్పటికీ సమాచారం లభించలేదు దీంతో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకళ మహేశ్వరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు చరణ్ తేజ ఆచూకీ కోసం ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాఘవేందర్ తెలిపారు.తప్పిపోయిన విద్యార్థి ఆచూకీ తెలిసినవారు వెంటనే 8712662368 మహేశ్వరం పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు - సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అధికారిక వేడుకల నిర్వహణ**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సమానత్వానికి, వీరోచిత పోరాటానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఆదేశాల మేరకు మంగళవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల (బీసీ) అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు జ్యోతి ప్రజ్వలన చేసి, పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.?ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ 1650 ఆగస్టు 18న ఒక సాధారణ కుటుంబం జన్మించి, అసాధారణ సాహసంతో గోల్కొండ కోటను స్వాధీనం చేసుకుని గొప్ప పరిపాలన అందించారని ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాలు త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించడం గర్వకారణమన్నారు.బీసీ సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు, భవిష్యత్తులో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మండల, గ్రామ స్థాయిలో అధికారికంగా నిర్వహించేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారిజె.రంగారెడ్డి, జిల్లా అధికారులు, జిల్లా బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు వైద్యం చేసే విధానం పట్ల నిర్లక్ష్యం చేయొద్దు



**మహేశ్వరం ఆగస్టు 18, (ది క్రైమ్ న్యూస్):** మూగజీవాలకు అత్యవసర సమయంలో వైద్య సేవలను సత్వరమే అందించాలని అంబులెన్స్ నిర్వహణ అధికారి శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం కందుకూరు మండల కేంద్రంలో ఉన్న సంచార పశువైద్యశాల అంబులెన్స్ ను తనిఖీ చేశారు అంబులెన్స్ లో ఉన్న వైద్య పరికరాలతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాలకు చికిత్స అవసరమైనప్పుడల్లా రైతులు (1962) ఫోన్ చేస్తే అంబులెన్స్ సిబ్బంది సతరమే స్పందించాలని తెలిపారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబులెన్స్ సిబ్బంది సాయికిరణ్ యాదయ్య వెంకటేష్ పాల్గొన్నారు.

# గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ఎస్టీ బంజారాలకు 10 శాతం రిజర్వుడ్ స్థానాలు కేటాయించాలి

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సభావాత్ రామచంద్రనాయక్ చౌహాన్**



**కూకట్‌పల్లి ఆగస్ట్ 18 (ది క్రైమ్ న్యూస్):** రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో బంజారాలకు 30 కార్పొరేటర్ రిజర్వుడ్ స్థానాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ, ప్రజా పాలన ప్రభుత్వాన్ని సభావత్ రామచంద్రనాయక్ చౌహాన్ కోరారు. ఎస్టీలకు రాష్ట్ర నలుమూలల నుండి కాకుండా ఇతర రాష్ట్రాల నుండి హైదరాబాద్, రంగారెడ్డి మేడ్చల్, పరిసర ప్రాంతాల్లో లక్షల సంఖ్యలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఉండడమే కాకుండా పూర్వం 100,150 సంవత్సరాలు నుండి నివాసమున్న అనేక బంజారా బిడ్డలు గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ లో నివాసం ఉన్నారని, ప్రస్తుతం దాదాపు 07 లక్షల నుంచి 09 లక్షల వరకు జనాభా కలిగి ఉన్న బంజారాలకు, గతంలో మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్న స్థానాలను మళ్లీ అదే స్థానంలో ఎస్టీ రిజర్వేషన్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ అంటే బంజారాల పార్టీ, బంజారా అంటే కాంగ్రెస్ పార్టీ బంజారా లు అన్న చందనంగా గత 150 సంవత్సరాలు నుండి కాంగ్రెస్ పార్టీ నమ్ముకుని ఉన్న బంజారాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్యాయం చేయదని ఆశాభావం వ్యక్తం చేశారు. బంజారాలను గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

# వృత్తి నైపుణ్యంతో విఐపీ భద్రతా విధులు నిర్వహించాలి

● రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా

● పిఎస్ఓల బాధ్యతలపై కమీషనరేట్‌లో సంక్షిప్త శిక్షణ





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** వృత్తి నైపుణ్యంతో విఐపీ భద్రతా విధులు నిర్వహించాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా పిఎస్ఓలకు సూచించారు. కమీషనర్ ఆదేశాల మేరకు మంగళవారం రామగుండం పోలీస్ కమీషనరేట్‌లో విఐపీ భద్రతా విధుల్లో ఉన్న పిఎస్ఓలకు భద్రతా ప్రమాణాలు, సమాచార మార్పిడి, సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన తదితర అంశాలపై సంక్షిప్త శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ పిఎస్ఓలకు శారీరక దారుఢ్యం ఎంతో ముఖ్యమని, ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మంచి అలవాట్లు, క్రమశిక్షణ, నిజాయితీ, విశ్వసనీయతతో విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకుదరావాలన్నారు. ప్రజలతో నేరుగా సంబంధం కలిగిన పిఎస్ఓలు ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతి, అక్రమ ప్రయోజనాలకు దూరంగా ఉండాలని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం డబ్బులు తీసుకోవడం పూర్తిగా తప్పని స్పష్టం చేశారు. ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టిలో పోలీసులపై నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు. విఐపీ భద్రతలో అనూహ్య పరిస్థితులు ఎప్పుడు ఎదురవుతాయో చెప్పలేమని, అప్రమత్తంగా ఉంటూ పరిసరాలను నిశితంగా పరిశీలించడం, పరిస్థితిని అంచనా వేయడం, తక్షణ నిర్ణయం తీసుకోవడం ముఖ్యమన్నారు. పోలీస్ శాఖలో పొందిన శిక్షణ, అనుభవం పిఎస్ఓలకు ప్రత్యేక బలమని, కవాతు సాధన, కృత్రిమ విన్యాసాలు, నిరంతర శిక్షణ ద్వారా నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని తెలిపారు. విధి నిర్వహణ సమయంలో పరిసరాలను నిరంతరం గమనిస్తూ, అనుమానాస్పద కదలికలు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సున్నితమైన సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, సామాజిక మాధ్యమాల్లో అనధికారికంగా పంచుకోరాదని, అత్యవసర పరిస్థితుల్లో శాఖా నియమావళికి అనుగుణంగా ప్రశాంతంగా, వేగంగా స్పందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, రమేష్, ఆర్ఐలు శేఖర్, దామోదర్, రమేష్, మల్లేశం, సీసీ సందీప్ పాల్గొన్నారు.

# ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అప్రమత్తంగా పనిచేయాలి

● మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా బి ఎల్ ఏ లు అప్రమత్తంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. ఎస్ ఐ ఆర్ లో భాగంగా ఆగస్టు 17న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదలైన నేపథ్యంలో పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఎల్ఏల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి బూత్ పరిధిలో డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హత ఉన్నప్పటికీ పేరు జాబితాలో రాని వారు, పేరు లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్న వారు, చిరునామా మార్పు జరిగిన వారు ఎవరైనా ఉంటే గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించాలని తెలిపారు. పేరు జాబితాలో లేని అర్హులైన వారికి ఫారం--6, ఓటరు వివరాల్లో సవరణలకు ఫారం--8, నిబంధనల ప్రకారం అనర్హమైన/డూప్లికేట్ నమోదులపై అభ్యంతరాలకు ఫారం--7 ద్వారా దరఖాస్తు చేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన ఫారాలను పూరించడంలో సహాయం చేసి, సంబంధిత బి ఎల్ వో లకు అందజేయడంతో పాటు అందుబాటులో ఉన్న అధికారిక ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని అన్నారు. ప్రతి కుటుంబంలోని ఓటర్ల పేర్లను పరిశీలించడంతో పాటు కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, ఇతర అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉన్నాయా లేదా ప్రత్యేకంగా పరిశీలించాలని బీఎల్ఏలకు దిశానిర్దేశం చేశారు. "ఓటు హక్కు ప్రతి పౌరుడి హక్కు. అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున జాబితా నుంచి తొలగిపోకుండా బీఆర్ఎస్ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలన్నారు. డ్రాఫ్ట్ జాబితా అనంతరం అందుబాటులో ఉన్న క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏలతో పాటు ఆయా మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

● బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ● పాపన్న 376వ జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి...



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మంథని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప యోధుడన్నారు. సామాన్య ప్రజలను ఏకం చేసి సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాలకు ధైర్యం, ఆత్మవిశ్వాసం కల్పించిన పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సమాన హక్కులు, గౌరవంతో జీవించేలా కృషి చేయడమే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్యం, సామాజిక చైతన్యం, ప్రజా సంక్షేమ దృక్పథాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు అందించేందుకు ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడంతో పాటు ఆయన జీవిత చరిత్రను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవపూర్ సర్పంచ్ చామంతి - శ్రీకాంత్, గౌడ సంఘం నాయకులు కొయ్యడ సతీష్ గౌడ్, బాలసాని ఈశ్వర్ గౌడ్ , పడాల సతీష్ గౌడ్, సలేంద్ర రాములు, విక్రమ్ గౌడ్, మెడగొన శ్రీకాంత్ గౌడ్, మెట్టు సమ్మయ్య గౌడ్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

# నేతికి సుభాష్ చంద్రబోస్‌కి నివాళులు అర్పించిన బండి రమేష్





**కూకట్ పల్లి ఆగస్ట్ 18 (ది క్రైమ్ న్యూస్):** మూసాపేట డివిజన్ అధ్యక్షుడు తూము సంతోష్ ఆధ్వర్యంలో మంగళవారం సుభాష్ చంద్రబోస్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. భారత స్వతంత్ర పోరాటంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని, యువతని స్వాతంత్ర పోరాటం వైపు నడిపించడానికి ఆయన కృషి చేశారని, తన వ్యూహరచనలతో ఆంగ్లేయుల గుండెల్లో వణుకు పుట్టించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూకట్ పల్లి బ్లాక్ అధ్యక్షులు, తూము వేణు, నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల జస్వంత్ రావు ( దేశాల్ ), సీనియర్ నాయకులు కర్కే పెంటయ్య, ఖైత్లపూర్ డివిజన్ అధ్యక్షులు శంకర్, యూత్ కాంగ్రెస్ సలీం, సీనియర్ నాయకులు నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్, తోటరాజు, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు..

## నివాళులు అర్పించిన జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం

**కరీంనగర్ టౌన్, ఆగస్టు18(ది క్రైమ్ న్యూస్):** బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బహుజన యోధుడు, చారిత్రక పురుషుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మంగళవారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్రపటానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తో కలిసి బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ సర్వాయి పాపన్న పోరాట పటిమ, జీవిత చరిత్ర, ఆయన చేసిన చారిత్రక పోరాటాలను ప్రత్యేకంగా ప్రస్తావించి కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని పెంపొందించడంలో, వారి హక్కుల కోసం నిలబడటంలో సర్వాయి పాపన్న చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయని తెలిపారు. నాటి పాలకుల నిరంకుశ విధానాలను ఎదిరించి, సామాన్య ప్రజల సంక్షేమం కోసం పోరాడిన గొప్ప ధీశాలి సర్వాయి పాపన్న అని కొనియాడారు. పాపన్న చూపిన సాహసం, నాయకత్వ లక్షణాలు పోరాట పటిమ నేటి యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సర్వాయి పాపన్న ఆశయాలు, ఆయన చూపిన మార్గం లో బిజెపి ప్రయాణిస్తూ, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు.



# శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడవద్దు

## రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా






**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** చట్టాల అమలులో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం గోదావరిఖని ఏసీపీ కార్యాలయాన్ని పోలీస్ కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి సీపీకి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఏసీపీ కార్యాలయంలోని వివిధ రికార్డులను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. డివిజన్ పరిధిలో దర్యాప్తులో ఉన్న కేసులు, వాటి పురోగతి, నిందితుల అరెస్టులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసుల స్థితిగతులు, పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను ఏసీపీ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి, వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని సీపీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సివిల్, భూవివాదాల్లో పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకోకుండా, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వ్యవహరించాలని సీపీ స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడంతో పాటు, ప్రతి కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీ అనంతరం పోలీసు అధికారులతో కలిసి ఏసీపీ కార్యాలయ ఆవరణలో సీపీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి, గోదావరిఖని సబ్ డివిజన్‌కు చెందిన సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# బహుజనుల బాగుకోసం కత్తిపట్టి పోరాడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్





**కూకట్ పల్లి ఆగస్ట్ 18 (ది క్రైమ్ న్యూస్):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని జనతానగర్, మూసాపేటలలో శేఖర్ గౌడ్, బి.బ్లాక్ అధ్యక్షులు తూము వేణు ల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో టిపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి పార్టీ ఇంచార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పాల్గొని పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బహుజన రాజ్య స్థాపనకు సర్వాయిపాపన్న పోరాటం చేసి చరిత్రలో చిరస్మరణీయుడు అయ్యారని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బహుజనులకు సముచిత స్తానం కల్పించి గౌరవించుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఏ.బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, సీనియర్ నాయకులు కార్కి పెంటయ్య, డివిజన్ ప్రెసిడెంట్ తూము సంతోష్, డివిజన్ ప్రెసిడెంట్ కలికోట శంకర్, సీనియర్ నాయకులు సునీల్, నాగరాజు, యూత్ కాంగ్రెస్ సలీం, సీనియర్ నాయకులు చున్నుపాషా, కేబుల్ శ్రీను, మధు, సప్పిడి భాస్కర్, సచిన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హాలియా 7వ వార్డులో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి




**నల్లగొండ జిల్లా ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్): ఆగస్టు 18 । హాలియా:** హాలియా మున్సిపాలిటీలో రోజువారీ పారిశుద్ధ్య పర్యవేక్షణ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి 7వ వార్డులో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. 7వ వార్డులో డ్రైనేజీల వెంట పెరిగిన పిచ్చి మొక్కలు, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మున్సిపల్ శానిటేషన్ సిబ్బందితో తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా చేయించారు. పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ చెత్త సేకరణ ఆటోలు వస్తున్నందున ప్రజలు తమ ఇళ్లలో వెలువడే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి చెత్త ఆటోలకు అందించాలని సూచించారు. అదేవిధంగా ఇంటి నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రైనేజీల్లో వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డ్రైనేజీల్లో చెత్త వేయడం వల్ల మురుగు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, తద్వారా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజలందరూ మున్సిపాలిటీకి సహకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కాపాడుకోవాలని చైర్మన్ చింతల చంద్రారెడ్డి కోరారు.

# ఆటో డ్రైవర్ల రాష్ట్రవ్యాప్త నిరవధిక బంద్‌కు పిలుపు

**● కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆటో జేఏసీ తీవ్ర ఆగ్రహం ● 21న పెద్దపల్లిలో భారీ ర్యాలీ.. 24 నుంచి నిరవధిక ఆటో బంద్ ● ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల సమస్యలు మరింత తీవ్రమయ్యాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆటో యూనియన్ల రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు మంద రవికుమార్ ఆరోపించారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 24 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక ఆటో బంద్ చేపట్టనున్నట్లు ప్రకటించారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం అమలుతో ఆటో డ్రైవర్ల గిరాకీ గణనీయంగా తగ్గి, వారి ఆదాయంపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు, సంవత్సరానికి రూ.12 వేల మెయింటెనెన్స్ భృతి, ఇళ్లు లేని వారికి ప్రభుత్వ భూమిలో ఇళ్ల నిర్మాణం, ఆటో నగర్ల ఏర్పాటు వంటి హామీలు ఇచ్చిందని రవికుమార్ గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై స్పష్టమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని గతంలో హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం 'ఆర్టీసీ ఆటో' ఆలోచన లేదని, ఆటో సంక్షేమ బోర్డుపై కేబినెట్‌లో చర్చ జరుగుతోందని మంత్రి ప్రకటించినప్పటికీ, కేవలం ఉద్యమాన్ని చల్లార్చేందుకే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారనే అనుమానం ఉందన్నారు. ముఖ్యమంత్రి సమక్షంలో స్పష్టమైన హామీ ఇచ్చి, దాని అమలుకు కార్యాచరణ ప్రకటించే వరకు ప్రభుత్వ ప్రకటనలను నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ ఉచిత బస్సు పథకం కారణంగా ఉపాధి కోల్పోయి, ఆర్థిక ఇబ్బందులతో దాదాపు 200 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని జేఏసీ నాయకులు ఆరోపించారు. ఇంతటి పరిస్థితి ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి, రవాణా మంత్రి తగిన స్థాయిలో




స్పందించడం లేదని మండిపడ్డారు. **21న పెద్దపల్లిలో భారీ ర్యాలీ:** రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఈ నెల 21న పెద్దపల్లి బస్‌స్టాండ్ కార్నర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ఆటోల ర్యాలీ నిర్వహించనున్నట్లు మంద రవికుమార్ తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించే తీరును బట్టి తదుపరి కార్యాచరణ ఉంటుందని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని ఆటో యూనియన్లు కలిసి బషీర్‌బాగ్‌లో ఆటో జేఏసీగా ఏర్పడ్డాయని, రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ నెల 24 నుంచి చేపట్టనున్న నిరవధిక బంద్‌ను విజయవంతం చేయాలని రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం నుంచి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో ఆటో జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్కే జబ్బర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జెరుపోతుల కుమార్, జిల్లా కన్వీనర్ ఎనగందుల నాంపల్లి, జిల్లా కో-కన్వీనర్ బండ సురేష్, జిల్లా కన్వీనర్ బందారపు కుమార్, రామగుండం ఇంచార్జి మడిపెద్ద రమేష్, మంథని నియోజకవర్గం ఇంచార్జి మడ్డి నర్సయ్య, పెద్దపల్లి కన్వీనర్ యాదగిరి శంకర్, నాయకులు ఈర్ల శంకర్, గాండ్ల సత్యానంద్, కందుల నర్సింగ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వీరుల చరిత్రల్లో సర్వాయి పాపన్న గౌడ్ ది ప్రత్యేక స్థానం

**● మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి**





**ధర్మపురి, ఆగస్టు 18, (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ వీరుల చరిత్రలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కి ప్రత్యేక స్థానం ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ధర్మపురిలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం నికి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన ధీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. నాటి సామాజిక అసమానతలకు, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసి, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన గొప్ప యోధుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని ఆమె పేర్కొన్నారు. గౌడ కులంలో జన్మించినప్పటికీ, సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం ఒక్క కులానికి మాత్రమే పరిమితం కాలేదని, సమాజంలోని ప్రతి వర్గానికి న్యాయం, గౌరవం, సమాన హక్కులు దక్కాలనే లక్ష్యంతో ఆయన పోరాడారని ఈ సందర్భంగా చైర్పర్సన్ నాగలక్ష్మి తెలిపారు. అందుకే సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచాయని తెలిపారు. అలాంటి మహనీయుడిని జయంతి సందర్భంగా స్మరించుకోవడం, ఆయన పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని వివరించారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజల ఐక్యత కోసం ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి గౌడ కులం అధ్యక్షులు నర్సాగౌడ్, మండల అధ్యక్షులు ఎల్లా గౌడ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు గడ్డం బాల గౌడ్, ఎంపీటీసీ గంగాధర్, ధర్మపురి పట్టణ ప్రజలు, గౌడ కులస్తులు మరియు తదితరులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలను స్మరించుకున్నారు.

# పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం మంత్రి సీతక్కకు బీపీ నాయక్ లేఖ

**మధిర (ది క్రైమ్ న్యూస్) ప్రతినిధి ఆగస్టు 18:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికుల తీవ్ర సమస్యలు -- మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, జీతాల పెంపు, పెండింగ్ బిల్లుల మంజూరువారి ప్రాథమిక హక్కుల రక్షణ కోసం విజ్ఞప్తి, మంత్రికి సాదర నమస్కారములు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కార్యాలయాల ముందు దీక్షలు చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల కష్టాలను నేరుగా పరిశీలించాను. వారి సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి కీలక సేవలు అందించే ఈ కార్మికులు తీవ్ర ఆర్థిక మరియు పనిభార సమస్యలతో బాధపడుతున్నారు. కాబట్టి ఈ విషయాన్ని మీ దృష్టికి తీసుకువచ్చి, తక్షణ పరిష్కారం కోసం విజ్ఞప్తి చేస్తున్నాను. పంచాయతీ కార్మికుల ప్రాథమిక హక్కులు,న్యాయమైన జీవనయోగ్యమైన వేతనం పొందే హక్కు,సకాలంలో జీతం నేరుగా బ్యాంకు ఖాతాలో జమ కావాల్సిన హక్కు,అధిక పనిభారం లేకుండా సమంగా పని చేసే హక్కు,ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రత హక్కులు ఆత్మగౌరవం సురక్షిత పని పరిస్థితులు కలిగి ఉండే హక్కు,పెండింగ్ బిల్లులు త్వరగా మంజూరు కావాల్సిన హక్కు ప్రధాన డిమాండ్లు,మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు:ఈ విధానం వల్ల ఒకే కార్మికుడిపై అనేక రకాల పనులు మోపడం జరుగుతోంది. దీనివల్ల వారి ఆరోగ్యం, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఈ విధానాన్ని వెంటనే రద్దు చేసి, పని భారాన్ని తగ్గించాలని కోరుతున్నాము,జీతాల పెంపు మరియు సకాల చెల్లింపు: ప్రస్తుతం మల్టీపర్పస్ వర్కర్లకు నెలకు కేవలం రూ.9,500 మాత్రమే జీతం ఇస్తున్నారు. ఇది ప్రస్తుత జీవన వ్యయాలకు అసలు సరిపోదు. కార్మికులు కనీసం రూ.18,000 నుంచి రూ.20,000 వరకు జీతం పెంచాలని, లేదా ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కనీస వేతనాల ప్రమాణాలకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రతి నెలా సకాలంలో నేరుగా బ్యాంకు ఖాతాలలో జమ చేసే విధంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి, పెండింగ్ బిల్లులు మంజూరు,చాలా మంది కార్మికుల బిల్లులు



నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని తక్షణమే మంజూరు చేసి చెల్లించాలి, సామాజిక భద్రత: కార్మికులకు తగిన కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు అందించాలి. వారి పని పరిస్థితులను మెరుగుపరచాలి. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడే పోరాటం చేశాము. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి, వారి హక్కులను కాపాడి డిమాండ్లను నెరవేర్చాలని మేము గట్టిగా ఆశిస్తున్నాము. మీరు ఈ విషయంలో తగిన అధికారులతో సమన్వయం చేసుకొని, కార్మికులకు శుభవార్త అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని మనవి చేస్తున్నాను. వీలైనంత త్వరగా ఈ విషయంపై సమావేశం ఏర్పాటు చేసి, సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాను. కార్మికులు గ్రామాల అభివృద్ధికి అవిరళంగా శ్రమిస్తున్నారు. వారి హక్కులను రక్షించి సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వం వారి పట్ల చూపే గౌరవాన్ని నిరూపించుకోవచ్చు. ఈ విషయంలో మీ సానుకూల స్పందనను ఆశిస్తూ, త్వరలోనే అనుకూల నిర్ణయం తీసుకోవాలని మరోసారి వినయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

# మధిర అభివృద్ధికి నిధులు మంజూరు

**● అభివృద్ధికి నిధులు వరాల జల్లు కురిపిస్తున్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ● నిధులు మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నా మండల కాంగ్రెస్ నాయకులు**

**మధిర (ది క్రైమ్ న్యూస్) ప్రతినిధి ఆగస్టు 18:** మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ అధ్యక్షతన మంగళవారం నాడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషితో మధిర మండల అభివృద్ధికి మంజూరైన రూ.11 కోట్ల నిధుల వివరాలను వెల్లడించారు. పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి (రోడ్లు) శాఖ జి.ఓ.ఆర్‌టి. నం.435 ద్వారా సి ఆర్ ఆర్ 2026-27 గ్రాంట్‌లి కింద మధిర మండలంలో మూడు కీలక రోడ్డు అభివృద్ధి పనులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంజూరైన అభివృద్ధి పనులు నక్కలగరువు పి డబల్ యు డి రోడ్డు నుంచి బుచ్చిరెడ్డిపాలెం వరకు జిలుగుమాడు మీదుగా 2.50 కి.మీ. రోడ్డు నిర్మాణం -- రూ.4.50 కోట్లు జిలుగుమాడు నుంచి నక్కలగరువు వరకు శివాలయం మీదుగా 2.50 కి.మీ. రోడ్డు నిర్మాణం -- రూ.4.50 కోట్లు వంగవీడు--నక్కలగరువు రహదారిపై పాలవాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం --



రూ.2.00 కోట్లు మొత్తం రూ.11.00 కోట్ల నిధులు మంజూరు కావడం మధిర మండల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మధిర అభివృద్ధిని తన బాధ్యతగా భావించి, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రహదారులు, మెరుగైన మౌలిక వసతులు అందించాలనే లక్ష్యంతో భట్టి విక్రమార్క నిధులు మంజూరు చేయిస్తు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని అన్నారు. మధిర మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే పట్టుదలతో భట్టి విక్రమార్క నిరంతరం కృషి చేస్తూ, అవసరమైన చోట నిధులు మంజూరు చేయిస్తూ మధిర అభివృద్ధికి నిధుల వరద పారిస్తున్నారని నాయకులు కొనియాడారు. గతంలో సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న రోడ్లు, వంతెనల వంటి ప్రజలకు అత్యవసరమైన మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని తెలిపారు. మధిర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రూ.11 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి మధిర మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మధిర మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత రామనాథం,మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి బుచ్చిరెడ్డిపాలెం సర్పంచ్ సంపసాల రామకృష్ణ కౌన్సిలర్లు యన్నం కోటేశ్వరావు, దోర్నాల శిరీష, బెజ్జం రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరువేదుల వెంకటేశ్వరరావు, మువ్వా వెంకయ్య, బాబు సామినేని రామనాథం, డివిజన్ కమిటీ అధ్యక్షులు దోర్నాల నాగ మురళి, తిరువీధుల రమేష్, దోర్నాల సంతోష్, దోర్నాల చిన్నకృష్ణ, దోర్నాల రవి, గొలమందల శీను పాల్గొన్నారు.

# గంధం వంశీ మెమోరియల్ ట్రస్ట్ లోగో నూతనంగా ప్రారంభం

**మధిర ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):ఆగస్టు 18 :** మధిర నియోజకవర్గ బోనకల్ మండలం గార్లపాడు గ్రామానికి చెందిన ఇటు వల్లే మరణించిన స్వర్గీయ గంధం,వంశీ బహుజన సమాజ్ పార్టీ ఉద్యమ నేత, సామాజిక సేవకుడు తన జీవించి ఉన్న సమయంలో ఎన్నో ప్రజా సమస్యల పై ,విద్య వ్యవస్థ బలోపేతం కోసం, ప్రభుత్వ పాఠశాల పిల్లలకు తన కున్న స్థాయి లో సేవ కార్యక్రమాలు నిర్వాహించరు తదనంతరం మరణించారు ఆయన ఆలోచనలు,తన సేవ ను కొనసాగించాలనే ఉద్దేశ్యం తో వారి తమ్ముడు గంధం.ఆనంద్,వారి అన్నయ్య గంధం పుల్లయ్య కలిసి ఫౌండర్స్ గా వంశీ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా సేవా చేయాలనే సంకల్పం తో ఖమ్మం జిల్లా లో మంగళవారం నాడు ప్రముకులు యలమద్ది హాస్పిటల్ డాక్టర్. ఎస్ .శరత్ చంద్ర (ఎం.డీ) (డి.ఏమ్)సీనియర్ న్యూరో ఫిజిషయన్ చేతుల మీదుగా లోగోను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశీ ఆశయాలు ,ఆలోచనలు మీరు కొనసాగించటం అనేది స్ఫూర్తి దాయకం అని, సమాజం లో ప్రతీ ఒక్కరు సేవ భావం కలిగి ఉండాలని తెలియ చేశారు ఈ కార్యక్రమంలో యలమద్ది హాస్పిటల్ మేనేజ్మెంట్ సైదేశ్వర రావు, మోదుగు రాజా ,వేణు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా సర్వాయి పాపన్న జయంతి..



**జమ్మికుంట ఆగస్టు 18 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట పట్టణంలో దేశిని కోటి గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి 376 వ జయంతి ఘనంగా నిర్వహించడం జరిగింది సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేయించి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి దుబ్బ మల్లన్న చైర్మన్ రవీందర్ ఆకుల రాజేందర్ కనుమల్ల గణపతి కార్మిక నాయకులు సామ్రాజ్యం కోలాగాని రాజు కౌన్సిలర్లు శ్రీపతి నరేష్ మాచర్ల రాజు గుర్రం కావ్య పరశురాం కుదాడి తిరుపతి బత్తుల లక్ష్మణ్ పాల్గొనడం జరిగింది . ములుగురి ప్రశాంత్ కుమార్. దేశిని కోటి. మరెల్లి మల్ల గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న భూస్వాముల పెత్తందారుల అరాచకాలు చూడలేక వాళ్ళు వసూలు చేస్తున్న పన్నులతో ఇబ్బంది పడుతున్న ప్రజల కోసం తిరుగుబాటు చేసి మొఘల్ సామ్రాజ్య సైనికులను తరిమికొట్టి ఇక్కడే కాదు ఈ ప్రాంతం మొత్తం ఇలాగే ఉందని తెలుసుకొని 12 మంది మిత్రులను మొదలైన సైన్యం 12 వేల మందితో గెరిల్లా సైన్యాన్ని తయారుచేసి గోల్కొండ కిలపై యుద్ధం చేసి మొగల్ సామ్రాజ్య చక్రవర్తులను మట్టికరిపించి కొన్ని సంవత్సరాలు రాజుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారు పరిపాలించి భూస్వాములను. పెత్తందారుల & మొఘల్ సామ్రాజ్యాన్ని అక్రమ పన్ను వసూలు లేకుండా ప్రజల స్వతంత్రంగా సమాన హక్కులు కల్పిస్తూ పరిపాలన సాగించాడు తన స్ఫూర్తితో ఈనాడు దేశం మొత్తం తనను ఆదర్శంగా తీసుకున్నారు మన రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గార్ల ఆధ్వర్యంలో ఈరోజు హైదరాబాద్ నడి ఒడ్డులో ట్యాంక్ బండ్ వద్ద తన విగ్రహావిష్కరణ కూడా చేస్తున్నారు వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుతూ మనందరం కులమతాలకు అతీతంగా తన ఆశయ సాధన కోసం తన స్ఫూర్తితో ముందుకెళ్లాలని చెప్పారు ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్స్ గడ్డం దీక్షిత్ రాజేశ్వరరావు గౌడ నాయకులు నాగపురి రాజు ప్రభాకర్ రాజు . నాయకులు పూదరి రేణుక శివ బొంగోని వీరన్న మరపల్లి బిక్షపతి శ్రీహరి పంజాల అజయ్ దేశిని శ్రీనివాస్ పున్నం శీను పాత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లకు మిర్యాలగూడ ఇన్‌చార్జి డీఎస్పీ జి. రవి హెచ్చరిక...



**నల్గొండ, ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** పాత నేరస్తులు మళ్లీ నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నల్గొండ జిల్లా మిర్యాలగూడ డివిజన్‌లోని హాలియా సర్కిల్ పరిధిలో పాత నేరస్తులు తిరిగి నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ ఇన్‌చార్జి డీఎస్పీ జి. రవి హెచ్చరించారు. మంగళవారం హాలియా సర్కిల్ కార్యాలయంలో రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవి వారి గత నేర చరిత్ర, ప్రస్తుత ప్రవర్తన, కార్యకలాపాలపై ఆరా తీశారు. ఇకపై ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. గొడవలకు దిగడం, ఇతరులను బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడటం, అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. గతంలో నేరాలకు పాల్పడినప్పటికీ ప్రస్తుతం చట్టబద్ధమైన జీవనం సాగిస్తూ కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించాలని సూచించారు. మళ్లీ నేర కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని డీఎస్పీ స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులతో కలిసి తిరగడం, వివాదాల్లో జోక్యం చేసుకోవడం, యువతను నేరాల వైపు ప్రోత్సహించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. చిన్నపాటి గొడవలు కూడా భవిష్యత్తులో పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున సంయమనంతో వ్యవహరించాలని తెలిపారు. కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నేరాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఇప్పటికే నేరాలకు దూరంగా ఉన్న వారు అదే విధానాన్ని కొనసాగించాలని, తిరిగి నేర కార్యకలాపాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని అధికారులు కోరారు. నేరాల నియంత్రణలో భాగంగా రౌడీషీటర్ల కదలికలు, ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా జీవిస్తే కుటుంబంతో పాటు సమాజంలోనూ గౌరవప్రదమైన స్థానం పొందవచ్చని పోలీసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాలియా, సాగర్ సీఐలు ఎస్. రాఘవరావు, శ్రీను నాయక్, ఎస్ఐలు బండి సాయి ప్రశాంత్, నరేష్, విజయ్‌కుమార్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# 27,305 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

## ● ఉల్లాస్--టాస్ సమన్వయ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశాలు

**మేడ్చల్, ఆగష్టు 18(ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో వయోజన అక్షరాస్యతను పెంపొందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఐఏఎస్ ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఉల్లాస్--టాస్ సమన్వయ సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. డైరెక్టరేట్ నుంచి జిల్లాకు మొత్తం 27,305 మంది అభ్యాసకులను అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. ఒక్కో ప్రాంతానికి 1,111 మంది చొప్పున లక్ష్యాన్ని కేటాయించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11 ప్రాంతాలకు 12,221 మంది, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11 ప్రాంతాలకు 12,221 మంది, ఎల్లంపల్లి, అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలకు కలిపి 3,333 మంది చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించారు. కేటాయించిన లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చేరుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రతి శాఖ అధికారులు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఉల్లాస్ అభ్యసన కేంద్రాలను ఏర్పాటు చేసి అభ్యాసకులను గుర్తించాలని, వారిని ప్రోత్సహించేందుకు అవగాహన, మార్గదర్శక సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. అక్షరాస్యత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ అన్ని ప్రభుత్వ శాఖలు కార్యక్రమంలో భాగస్వాములై సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమం అమలుపై ప్రతి వారం ప్రగతి నివేదికను పరిశీలిస్తామని తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ వయోజన విద్య మాట్లాడుతూ విద్య



అందరికీ అందేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇప్పటికే అక్షరాస్యులైన వారు తమ ఇరుగు పొరుగున నివసించే నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీఆర్‌డీఓ శంభశివరావు, మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ, డీఈఓ రేణుకాదేవి, డీడబ్ల్యూఓ శారద, టాస్ డీసీ సత్యనారాయణ, ఎస్‌ఎంసీ మెప్మా డాక్టర్ సుజాత, పీవోలు పద్మావతి, సురేష్, ఇంద్రసేన్, మల్లికార్జున్, మధుసూదన్‌రావు, సురేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన అధికారులకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఉల్లాస్ ఇన్‌చార్జి పీవో నరసింహారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# ఉప్పల్‌కు బ్లడ్ బ్యాంక్, డయాగ్నస్టిక్ సెంటర్ మంజూరు చేయాలి

## ● ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి

**మేడ్చల్, ఆగష్టు 18(ది క్రైమ్ న్యూస్):** నియోజకవర్గ ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉప్పల్‌లో ప్రభుత్వ రక్త నిల్వ కేంద్రంతో పాటు సమగ్ర వైద్య పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహను కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఉప్పల్ నియోజకవర్గ జనాభా వేగంగా పెరుగుతున్నప్పటికీ, ఈ ప్రాంతంలో ప్రస్తుతం ప్రభుత్వ రక్త నిల్వ కేంద్రం, పూర్తి స్థాయి ప్రభుత్వ వైద్య పరీక్షల కేంద్రం అందుబాటులో లేవని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైనప్పుడు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదేవిధంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు రక్త పరీక్షలు, రక్తంలో చక్కెర పరీక్ష, కాలేయం, మూత్రపిండాల పనితీరు పరీక్షలు, శరీరంలోని అంతర్గత అవయవాల చిత్ర పరీక్షలు తదితర వైద్య పరీక్షల కోసం ప్రైవేట్ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోందని, దీంతో వారికి ఆర్థిక భారం పడుతోందన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సకాలంలో వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్య పరీక్షల సదుపాయాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉప్పల్‌లో రక్తంలోని వివిధ భాగాలను వేరు చేసే సదుపాయంతో కూడిన ప్రభుత్వ రక్త నిల్వ కేంద్రాన్ని, రోగ నిర్ధారణ, రక్త పరీక్షలు, కణజాల పరీక్షలు, చిత్రీకరణ పరీక్షలు, శరీర అంతర్గత అవయవాల పరీక్షలు వంటి అవసరమైన సేవలతో కూడిన సమగ్ర ప్రభుత్వ వైద్య పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ రెండు సదుపాయాలు అందుబాటులోకి వస్తే ఉప్పల్ నియోజకవర్గంతో



పాటు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, అత్యవసర వైద్య సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులను ఆదేశించి రక్త నిల్వ కేంద్రం, వైద్య పరీక్షల కేంద్రం ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్, గంధం నాగేశ్వర్ రావు, జెట్ట కిషోర్ కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వాభిమానం, సమానత్వం కోసం పోరాడిన వీరుడు పాపన్న గౌడ్: రవికుమార్ యాదవ్





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** స్వాభిమానం, సమానత్వం కోసం పోరాడిన వీరుడు పాపన్న గౌడ్ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా మియాపూర్ ఆల్విన్ కాలనీ చౌరస్తా వద్ద ఉన్న ఆయన విగ్రహానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై జన్మించిన ధైర్యవంతుడైన మహాయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఆయన జీవితం ధైర్యం, ఆత్మగౌరవం, సమానత్వం, ప్రజా పోరాటానికి ప్రతీక అని పేర్కొన్నారు. 17వ శతాబ్దంలో అణగారిన ప్రజల హక్కుల కోసం పాపన్న గౌడ్ పోరాడారని, సామాజిక, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసి వారిలో ధైర్యాన్ని నింపారని తెలిపారు. సర్వాయిపేట, తాటికొండ, షాపూర్ కోటలు ఆయన వీరోచిత పోరాట చరిత్రకు ప్రతీకలుగా నిలిచాయని అన్నారు. అధికారం కొందరి చేతుల్లోనే కాకుండా అణగారిన వర్గాలకు సైతం గౌరవం, నాయకత్వం, అధికారం ఉండాలన్న గొప్ప ఆలోచనతో పాపన్న గౌడ్ పోరాడారని రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. అన్యాయానికి తలవంచకుండా ధైర్యంగా పోరాడాలన్న ఆయన స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, న్యాయం కోసం కృషి చేయడమే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ గౌడ్, కరుణాకర్ గౌడ్, నాగులు గౌడ్, యాదగిరి గౌడ్, గౌతమ్ గౌడ్, రాజేష్ గౌడ్, ఏకాంత్ గౌడ్, దశరథ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, వినయ్ గౌడ్, దాత్రినాథ్ గౌడ్, మహేష్ గౌడ్, వెంకటేష్ గౌడ్, కల్పనా గౌడ్, విక్రమ్ గౌడ్, మహేష్ యాదవ్, ఇలియాస్ షరీఫ్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ భూముల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి వేగం పెంచాలి

## ● 335 జీవోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్.. అర్హత ఉన్న భూములకు త్వరితగతిన క్లియరెన్స్ ఇవ్వాలి ● కలెక్టర్ మను చౌదరి





**మేడ్చల్, ఆగష్టు 18(ది క్రైమ్ న్యూస్):** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చిన ప్రైవేట్ భూముల ఆస్తుల క్లియరెన్స్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో 335 జీవోలను అప్‌లోడ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఆయా జీవోలను ఆధారంగా చేసుకుని 22ఏ కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, అర్హత ఉన్న వాటిని వెంటనే క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మంగళవారం అల్వాల్ సబ్ రిజిస్ట్రార్ (వల్లభ్‌నగర్) కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి సందర్శించారు. 22ఏ నిషేధిత భూముల జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల క్లియరెన్స్ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న జీవోలను పరిశీలించి, వాటికి అనుగుణంగా వచ్చిన దరఖాస్తులను సంబంధిత రికార్డులతో సరిపోల్చి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుల పరిశీలనలో లింక్ డాక్యుమెంట్లను క్షుణ్ణంగా వెరిఫై చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూములకు సంబంధించిన పాత రికార్డులు, హక్కు పత్రాలు, ఇతర సంబంధిత వివరాలను పరిశీలించిన అనంతరం మాత్రమే క్లియరెన్స్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పట్టణ భూ గరిష్ఠ పరిమితి కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ జాబితాలో చేర్చిన భూములకు సంబంధించి అర్హత ఉన్న దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను సులభతరం చేయాలని కలెక్టర్ తెలిపారు. సంబంధిత రికార్డులను పరిశీలించి, క్లియరెన్స్‌కు అర్హత ఉన్న భూములను జాబితా నుంచి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ విషయంలో ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పెండింగ్ కేసులను ఎక్కువ కాలం కొనసాగించకుండా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల పరిశీలన, క్లియరెన్స్ ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతున్నదో కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇప్పటివరకు 22ఏ క్లియరెన్స్ కోసం ఎన్ని దరఖాస్తులు అందాయి, వాటిలో ఎన్ని దరఖాస్తులను పరిష్కరించారు, ఇంకా ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి, వాటి పెండింగ్‌కు గల కారణాలు ఏమిటనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను విభాగాల వారీగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన 335 జీవోలను ఆధారంగా చేసుకుని సంబంధిత దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించడం ద్వారా భూ యజమానులకు పరిష్కారం లభించేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రికార్డుల పరిశీలనలో స్పష్టత లేని కేసులను అవసరమైన స్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఆర్డీవో శ్యాంప్రకాష్, అల్వాల్ తహసీల్దార్ రాములు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, రెవెన్యూ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## డి.వి.జి ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలకు ఆర్థికసాయం



**కూకట్‌పల్లి ఆగస్ట్ 18 (ది క్రైమ్ న్యూస్):** ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని మహాత్మాగాంధీ నగర్ కాలనీకి చెందిన కుర్మయ్య(61) అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన విషయం తెలుసుకున్న డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ స్థానిక నాయకులను ఆదేశించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా 5,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఇంద్రసేన రెడ్డి, సందీప్, కాలనీ వాసులు తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## చరిత్రకారుడి చరిత్రను ప్రతి గౌడ కుటుంబం తెలుసుకోవాలి: మల్యాల రాములు గౌడ్



**మానకొండూరు, ఆగష్టు 18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంతో పాటు చెంజర్ల, కొండపలకల గ్రామాల్లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి వేడుకలను ఆయా గ్రామాల గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.చెంజర్లలో నిర్వహించిన వేడుకలకు సంఘ రాష్ట్ర నాయకులు మల్యాల రాములు గౌడ్ హాజరై మాట్లాడుతూ..... వరంగల్ జిల్లా ఖాసీంపల్లి లో ఓ నిరుపేద కుటుంబంలో జన్మించి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రథమ యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు.లండన్ మ్యూజియంలో పాపన్న చిత్రపటాన్ని గుర్తించిన తెలంగాణ ప్రాంత వాసులు ఆయన జయంతి వేడుకలు నిర్వహించాలన్న ఆలోచనతో 2001నుండి పాపన్న జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గౌడ కులానికి చెందిన చరిత్రకారుడి చరిత్రను ప్రతి గౌడ కుటుంబం తెలుసుకోవాలని కోరుతూ కల్లు గీసేవాళ్ళే కాక గౌడ కుల ప్రతీ యువత సంఘాలను ఏర్పరచుకొని ఐక్యతగా నిలవాలని పిలుపునిచ్చారు.సంఘ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ తిరుపతి గౌడ్, నియోజకవర్గ ఇన్చార్జి గోపగోని నవీన్ గౌడ్,గ్రామాధ్యక్షుడు సింగం నర్సయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు బుర్ర చంద్రయ్య గౌడ్,సభ్యులు సుదగోని వీరాస్వామి గౌడ్,దూలం పర్శరాములు గౌడ్, బుర్ర తిరుపతి గౌడ్,నేరెళ్ళ సంపత్ గౌడ్,బుర్ర రత్నాకర్ గౌడ్, కంకటి గోపాల్ గౌడ్,మూల శేఖర్ గౌడ్ గౌడ కులస్తులు అధిక సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు.

# రాంపల్లిలో కమిషనర్ తనిఖీ

## పారిశుధ్యం, రోడ్ల పనులపై పరిశీలన.. సిఅండ్డి వ్యర్థాలపై కఠిన చర్యలు





**మేడ్చల్, ఆగష్టు 18(ది క్రైమ్ న్యూస్):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి మంగళవారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని రాంపల్లి ప్రాంతంలో పర్యటించారు. పారిశుధ్యం, రహదారుల అభివృద్ధి, నిర్వహణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఏటీ వాహనాల పనితీరు, యఫ్ఆర్ ఎస్ అటెండెన్స్ అప్‌డేషన్ వివరాలను సమీక్షించారు. రాంపల్లిలోని ప్రధాన, అంతర్గత రహదారులపై జరుగుతున్న రోడ్ వైడెనింగ్ పనులను పరిశీలించడంతోపాటు గుంతలు, ప్యాచ్‌వర్క్ సమస్యలను గుర్తించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రహదారులపై ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాలు, ఓపెన్ స్పేస్‌లలో నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలు(సీ అండ్ డీ) పడేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. వ్యర్థాలను నిర్దేశించిన ప్రదేశాలకు మాత్రమే తరలించేలా పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. అనంతరం రహదారుల వెంట ఏర్పాటు చేసిన ప్లాంటర్ బాక్సులను పరిశీలించారు. మొక్కలు లేకుండా ఖాళీగా ఉన్న ప్లాంటర్ బాక్సులను గుర్తించి తొలగించాలని, మిగిలిన వాటిలో మొక్కలు ఏర్పాటు చేసి నిరంతరం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్యం, రహదారుల అభివృద్ధి, పచ్చదనం పెంపు పనులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. పర్యటనలో అన్ని విభాగాల సెక్షన్ హెడ్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కుషాయిగూడలో వివాహిత అదృశ్యం



**మేడ్చల్, ఆగష్టు 18(ది క్రైమ్ న్యూస్):** కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. డిఫెన్స్ కాలనీ, నిర్మల్‌నగర్, సైనిక్‌పురి ప్రాంతానికి చెందిన పెరమళ్ళ నవీన్‌కుమార్ (35) తన భార్య పెరమళ్ళ రేవతి (30) కుటుంబ విషయమై గొడవ జరిగిన అనంతరం ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 18న ఉదయం సుమారు 8 గంటల సమయంలో కుటుంబ విషయమై భార్యతో గొడవ జరిగింది. అనంతరం రేవతి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం బంధువుల ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన రేవతి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

## విధుల్లో చేరిన సూపర్ వైజర్ పద్మ



**లక్షెట్టిపేట, ఆగష్టు 18 (ది క్రైమ్ న్యూస్) :** పట్టణంలోని ఐసీడీఎస్ అంగన్వాడీ సెక్టార్ 1 కు ఇటీవల బదిలీపై వచ్చిన సూపర్ వైజర్ పద్మ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని నీరజ రాణి సెంటర్ లో సూపర్ వైజర్ పద్మకు అంగన్వాడీ టీచర్స్ ఘనంగా స్వాగతం పలికి,సన్మానం చేశారు.అనంతరం నూతన సూపర్ వైజర్ పద్మ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా టీచర్స్, సిబ్బంది పరస్పర సహకారంతో అంగన్వాడీ సెంటర్ లలో మంచి ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ జ్యోతి, శంకరమ్మ, లక్ష్మీ, రాధిక, నీరజరాణి, దుర్గ, కృష్ణవేణి, శాంత, రాజమణి, లత, విజయలక్ష్మి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్ ఆశయాలే సామాజిక న్యాయానికి మార్గదర్శకం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బహుజన రాజ్య తొలి స్వాప్నికుడు, సామాజిక న్యాయానికి స్ఫూర్తి ప్రదాత సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఆరెకపూడి గాంధీ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో పాటు గౌడ సోదరులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై జన్మించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహోన్నత ప్రజా యోధుడని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి, సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజల రాజ్యాధికార చైతన్యం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని తెలిపారు. మనిషికి గౌరవం ఉండాలి, అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడాలి, అణగారిన వర్గాలకు అవకాశాలు కల్పించాలి, అధికారంలో అన్ని వర్గాలకు భాగస్వామ్యం ఉండాలనే ఆలోచనలను పాపన్న తన పోరాటం ద్వారా చాటిచెప్పారని గాంధీ పేర్కొన్నారు. అందుకే ఆయన కేవలం చారిత్రక వీరుడు మాత్రమే కాకుండా ఆత్మగౌరవానికి ప్రతీక, సామాజిక న్యాయానికి స్ఫూర్తి, సమానత్వానికి చిహ్నంగా నిలిచారని అన్నారు. సామాన్య కుటుంబం నుంచి ఎదిగి ప్రజలను తన పోరాట శక్తిగా మలుచుకున్న పాపన్న సామాజిక అసమానతలు, దోపిడీ, ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడారని గాంధీ తెలిపారు. సైనిక ప్రతిభతో అనేక కోటలపై తన ప్రభావాన్ని స్థాపించి, అప్పటి అధికార వ్యవస్థలకు సవాల్‌గా నిలిచిన ధీరుడు పాపన్న అని కొనియాడారు. పాపన్నతో అనుబంధం ఉన్న ఖిలాషాపూర్ కోటను చారిత్రక వారసత్వ కట్టడంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం ఆయన చారిత్రక ప్రాధాన్యతకు నిదర్శనమని గాంధీ అన్నారు. పాపన్నను స్మరించుకోవడం కేవలం జయంతి వేడుకలకే పరిమితం కాకుండా ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన గౌరవం, సమాన అవకాశాలు, తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాపన్న ఐక్యతా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. పాపన్న పోరాటంలో గోల్కొండ ఘట్టం అత్యంత కీలకమైనదని గాంధీ పేర్కొన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టిన వ్యక్తి ప్రజాబలంతో ఎదిగి గోల్కొండ వంటి ప్రధాన అధికార కేంద్రాన్ని సవాలు చేయడం ఆయన అసాధారణ పోరాట పటిమకు నిదర్శనమన్నారు. ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా వెనకడుగు వేయకుండా పోరాటాన్ని కొనసాగించిన పాపన్న జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం సభ్యులు, గౌడ సోదర సోదరీమణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# హైదర్‌నగర్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన

- పాదచారుల భద్రతకు ప్రాధాన్యం.. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేస్తాం: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో జాతీయ రహదారిపై పాదచారుల భద్రత కోసం నూతనంగా నిర్మించనున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ స్థలాన్ని పరిశీలించారు. తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి ప్రతిపాదిత ప్రాంతాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ హైదర్‌నగర్ పరిసర ప్రాంత ప్రజలకు ఇది శుభవార్త అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న పాదచారుల సమస్యకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో పరిష్కారం లభించనుందని తెలిపారు. హైదర్‌నగర్ జాతీయ రహదారి నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉంటుందని, దీంతో పాదచారులు రోడ్డు దాటే సమయంలో ఇబ్బందులు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. పాదచారులు సురక్షితంగా రోడ్డు దాటేందుకు అన్ని సౌకర్యాలతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నట్లు గాంధీ తెలిపారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా పాదచారులకు రక్షణ కల్పించడంతో పాటు రోడ్డు దాటే సమయంలో జరిగే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. పాదచారుల రాకపోకల కారణంగా ఏర్పడే ట్రాఫిక్ సమస్యలు కూడా తగ్గుతాయని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు సులభంగా రాకపోకలు సాగించేలా మెట్లతో పాటు అవసరమైన చోట లిఫ్ట్‌లు లేదా ర్యాంప్‌లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రజలకు ఉపయోగకరంగా అన్ని హంగులు, సౌకర్యాలతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని అధికారులకు గాంధీ సూచించారు. పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈలు శ్రీదేవి, కార్తీక్, ఏఈ యుగేందర్, నాయకులు, కార్యకర్తలు, హైదర్‌నగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ భూముల జాబితా రద్దు చేయాలి

- ప్రభుత్వమే తప్పు చేసి ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు: హరీశ్‌రావు





**మేడ్చల్, ఆగస్టు 18(ది క్రైమ్ న్యూస్):** 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మల్కాజ్‌గిరిలో 22ఏ భూముల బాధితులతో మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టిస్తున్నదని విమర్శించారు. రాత్రికి రాత్రే కాలనీలకు కాలనీలను నిషేధిత జాబితాలో చేరిస్తే ప్రజలు ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు అధికారుల చుట్టూ తిరుగుతూ చెప్పులు అరిగించుకోవాలా అని నిలదీశారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్‌సీని రద్దు చేసిందని, ఆ తర్వాత ఆయా భూములు పట్టా భూములుగా మారి ఏళ్లుగా ప్రజలు నివసిస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. 20 ఏండ్లుగా లేని సమస్యను ఇప్పుడు ఎందుకు సృష్టించారని ప్రశ్నించారు. రంగారెడ్డిలో 7,500 జీఓల ద్వారా మినహాయింపు పొందిన భూములు, మేడ్చల్‌లో 6 వేలకుపైగా భూములు, హెచ్ఎండీఏ, హుడా పరిధిలోని భూములను సైతం నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలపై పట్టు సాధించేందుకే నిషేధిత భూముల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. భూమిని విక్రయించేందుకు వెళ్లే వరకు తమ స్థలం 22ఏ జాబితాలో ఉందనే విషయం కూడా ప్రజలకు తెలియడం లేదని హరీశ్‌రావు అన్నారు. లక్షలాది స్థలాలు, ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చారని పేర్కొన్నారు. తిలక్‌నగర్‌కు చెందిన అశోక్ 450 గజాల ఇంటిని విక్రయించేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన తర్వాత అది నిషేధిత జాబితాలో ఉన్నట్లు తెలిసిందన్నారు. మరుసటి రోజు అమెరికా వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్న ఆయన ఇప్పుడు వెళ్లాలా.. వద్దా.. అక్కడ ఉద్యోగం చేయాలా.. వద్దా అనే పరిస్థితిలో పడ్డారని తెలిపారు. వివిధ జర్నలిస్ట్‌లు తన సమస్యను సోషల్ మీడియాలో వెల్లడించారని, ఆయన ఒక్కరే కాకుండా అనేక మంది జర్నలిస్టులు, సామాన్యులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారని చెప్పారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు సారీ చెబితే ప్రజల బాధలు తీరుతాయా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. అసలు భూములను నిషేధిత జాబితాలో చేర్చింది ఎవరు? ఎవరి ఆదేశాలతో చేర్చారు. అనే విషయాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పదవికి రాజీనామా చేయాలని కోరారు. నిషేధిత జాబితాలో భూములను చేర్చింది ప్రభుత్వమే కాబట్టి వాటిని తొలగించాల్సింది కూడా ప్రభుత్వమేనన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుని కార్యాలయాల చుట్టూ తిప్పకుండా, ఎట్లా చేర్చారో అట్లాగే నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా సక్రమంగా పనిచేయడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల వివరాలు, తొలగించిన భూముల వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి ప్రభుత్వం వైట్‌పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత మంత్రిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రజలకు అండగా లేకపోయినా బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. "మీకు ఎలాంటి కష్టం వచ్చినా తెలంగాణ భవన్‌లోని జనతా గ్యారేజ్ తలుపులు మీకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయి. మీకు ఏ ఇబ్బంది వచ్చినా, ఎవరైనా 30 శాతం కమీషన్ అడిగినా మీకు అండగా జనతా గ్యారేజ్, మా పార్టీ ఉంటుంది" అని అన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పు చేసిన కాంగ్రెస్ నాయకులను చట్టపరంగా బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. 22ఏ భూముల అంశంపై అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, 22ఏ బాధితులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు.... డంపింగ్ యార్డే ప్రధాన కారణం

- డేంజర్ జోన్‌లో కరీంనగర్ డంపింగ్ లికరీంనగర్ నగర ప్రజలకు సమస్యగా మారిన డంప్‌యార్డ్‌ను వెంటనే ఎత్తివేయాలి: గుంజపడుగు హరిప్రసాద్ జిల్లా బాధ్యుడు తెలంగాణ రక్షణ సేన కరీంనగర్



**కరీంనగర్ టౌన్, ఆగస్టు18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగర ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని బైపాస్ రోడ్డులో ఉన్న డంప్‌యార్డ్‌ను అక్కడి నుండి ఎత్తివేసి నగరానికి దూరంగా తరలించాలని, అక్కడ కూడ శాస్త్రీయ పద్ధతులతో వ్యర్థాల నిర్వహణ చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈరోజు తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ అంకం శివరాణి ఆద్వర్యంలో ప్రజలకు ఇబ్బందికరంగా మారినా డంపింగ్ యార్డ్ బైపాస్ రోడ్డ్ నుండి కరీంనగర్ నగరానికి దూరంగా తరలించాలని డంపింగ్ యార్డ్ వద్ద ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో ఉన్న డంప్‌యార్డ్‌లో సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్త కారణంగా దుర్వాసన, పొగ, దుమ్ము మరియు ఇతర పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయని. కోతిరాంపూర్, లక్ష్మినగర్, కట్ట రాంపూర్, కొత్త యాస్వద, కమాన్ ప్రాంతం, బస్టాండ్, అంబేద్కర్ స్టేడియం ఇలా సగం నగరం అంతా పొగతో దుమ్ముతో కరీంనగర్ ప్రజలు తీవ్రమైన అరోగ్య ఇబ్బందులు పడుతున్నారని గుంజపడుగు హరిప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ నగరంలో నివాస ప్రాంతాలకు సమీపంలో పెద్దఎత్తున వ్యర్థాలతో పేరుకుపోవడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని, ప్రభుత్వం ఇప్పటికే డంప్‌యార్డ్‌ను తరలించే అంశంపై సాక్షాత్తూ కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, బండి సంజయ్, కరీంనగర్ మేయర్ అందరూ డంపింగ్ యార్డ్ సమస్యను తిర్చుతామని మాట ఇచ్చి తప్పరని వారు అన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా డంపింగ్ యార్డ్‌ను స్మార్ట్ డంప్ యార్డ్ గా మారుస్తామని చెప్పిన నగర పాలక సంస్థ పాలకుల మాటలు బూటాకం అని తేలిపోయింది. ప్రభుత్వం కరీంనగర్ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైన యుద్ద ప్రాతిపాదికన నగరానికి దూరంగా తరలించి బయోమైనింగ్ ద్వారా చెత్తను పూర్తిగా తొలగించాలని అలాగే భవిష్యత్తులో నగరంలో చెత్త పేరుకుపోకుండా తడి, పొడి వ్యర్థాలను వార్డ్ స్థాయిలోనే వేరు చేసి, శాస్త్రీయంగా ప్రాసెసింగ్ చేసే శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా అదివాసి విభాగం అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, జిల్లా సీనియర్ రంగరవేణి లక్ష్మణ్, బుడిగె పర్శారం గౌడ్, నూతి చరణ్, బాసవేణి రాజేందర్, యండి రజీ, పుసాల పవన్, కొత్తూరి రఘు, యండి హుస్సేన్, మడిపల్లి వినీత్, అభిరామ్, గర్షకుర్తి విద్యాసాగర్, గుంజపడుగు పవన్, సుత్తాల రాజన్నా, మహిళ విభాగం నాయకురాలు యండి సల్మా, దాసరి అంజలి, దీటి శిరీష రమేష్, కొరిమి పద్మ, కొలిపాక గౌతమి, కాంతాల రోజా రెడ్డి, కుతాడి రజిత, వరుణ్ యదవ్, గడ్డం రవికుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి

- నేటి యువతకు స్ఫూర్తి సుభాష్ చంద్రబోస్ - స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రభావితం చేయడమే కాకుండా బ్రిటిష్ నుండి విముక్తి






**కరీంనగర్ టౌన్, ఆగస్టు18(ది క్రైమ్ న్యూస్):** భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం ప్రపంచంలోని ఎన్నో దేశాలకు మార్గదర్శకమని, స్వాతంత్ర్యం సాధించిన విధానం నేటికీ స్ఫూర్తి ఇస్తుందని ఇందుకు ప్రధాన కారణం దేశ నాయకులే అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి, స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పాలు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి నేతాజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్ ని ఆదర్శంగా తీసుకోవాలని, వారు అవలంబించిన విధానాలు నేటికీ చాలా ప్రభావితం చేస్తున్నాయని గుర్తు చేస్తూ చిన్నతనం నుండే దేశభక్తిని పెంపొందించుకొని దేశం పట్ల విధేయతను చాటి దేశ నాయకునిగా ఎదిగి ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమం పట్ల ఆసక్తిని పెంపొందించాలనే ప్రధాన ఉద్దేశంతో, యువతను ప్రభావితం చేయడానికై ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకునిగా అనేక కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా దేశ యువతను సైన్యంలో పాల్గొనేలా ప్రోత్సాహం అందించి దేశభక్తిని పెంపొందించారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు, చాలా మంది చిన్నారులు వారి వేషధారణలో విచ్చేసి దేశభక్తిని చాటారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆలపించినటువంటి పలు దేశభక్తి గేయాలు స్ఫూర్తినింపాయి, కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఆర్థిక వివాదం నేపథ్యంలో మోహన్ నాయుడును హత్య చేసి, మృతదేహాన్ని గోనె సంచిలో పెట్టి అటవీ ప్రాంతంలో పాతిపెట్టిన కేసులో ముగ్గురు నిందితులకు కోర్టు జీవిత ఖైదు విధించింది. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2010లో జరిగిన ఈ హత్య కేసులో నిందితులు బోనాల నాగాచారి (47), యెంగన్నగారి వెంకటాచారి (48), పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రబీర్ మండల్ అలియాస్ ప్రవీణ్ (48)గా పోలీసులు తెలిపారు. మోతీనగర్‌లోని స్నేహపురి కాలనీకి చెందిన ఫిర్యాదుదారు టి. విజయ్ కుమార్ తమ్ముడు మోహన్ నాయుడు (45) 2010 డిసెంబర్ 14న కేపీహెచ్‌బీ కాలనీ నుంచి అదృశ్యమయ్యాడు. దర్యాప్తులో భాగంగా గోకుల్ ప్లాట్స్‌లోని ఓ గదికి మద్యం సేవించేందుకు పిలిపించిన నిందితులు ఆర్థిక వివాదం కారణంగా అతడితో గొడవకు దిగినట్లు తేలింది. అనంతరం ఏ1 నాగాచారి తుపాకీతో మోహన్ నాయుడి తలపై కాల్పులు జరిపి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. హత్య అనంతరం మృతుడి బంగారు ఉంగరాలు, గొలుసు, సెల్‌ఫోన్‌ను తీసుకుని మృతదేహాన్ని గోనె సంచిలో ఉంచి మెదక్ జిల్లా చేగుంట సమీపంలోని అటవీ ప్రాంతంలో పాతిపెట్టినట్లు దర్యాప్తులో బయటపడింది. మృతుడి దుస్తులు, ఇతర వస్తువులను హస్మత్‌పేట్ చెరువులో పడేసినట్లు పోలీసులు తెలిపారు. ఫోరెన్సిక్ పరీక్షల్లో తుపాకీ గాయమే మరణానికి కారణమని నిర్ధారణ కాగా, డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహం మోహన్ నాయుడిదేనని నిర్ధారించారు. 2011 సెప్టెంబర్ 2న ఏ1 నాగాచారి, ఏ2 వెంకటాచారిని ఫియట్ కారులో పారిపోతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద దేశీయ తయారీ తుపాకీ, బుల్లెట్లు లభించాయి. విచారణలో సుమారు ఎనిమిదిన్నర నెలల ముందు ఏ3 ప్రబీర్ మండల్‌తో కలిసి మోహన్ నాయుడిని హత్య చేసేందుకు పథకం రూపొందించినట్లు వెల్లడైంది. రాజీవ్ గృహకల్పలో ఇల్లు మంజూరు చేయిస్తానని చెప్పి మోహన్ నాయుడు ఏ1 వద్ద నుంచి రూ.20 వేల తీసుకున్న విషయంలో ఏర్పడిన వివాదమే హత్యకు కారణమని దర్యాప్తులో తేలింది. ఏ3ను 2011 డిసెంబర్ 13న అరెస్ట్ చేశారు. పూర్తి దర్యాప్తు అనంతరం పోలీసులు నిందితులపై అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ పూర్తైన అనంతరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని ××× అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం ముగ్గురు నిందితులను దోషులుగా నిర్ధారించి శిక్షలు విధించింది. ఏ1 నుంచి ఏ3 వరకు నిందితులకు హత్య, ఆధారాల ధ్వంసం తదితర నేరాలకు జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా, ఇతర సెక్షన్ల కింద అదనపు జైలు శిక్షలు, జరిమానాలు విధించింది. ఆయుధ చట్టంలోని సెక్షన్లు 25, 27 కింద ఏ1, ఏ2లకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా, ఏ1 నుంచి ఏ3 వరకు సెక్షన్ 27 కింద జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు ఎన్. నరసింహారెడ్డి, జి. బసవరెడ్డి, ఎ.గంగారం దర్యాప్తులో కీలకంగా వ్యవహరించారు. విచారణ సమయంలో ప్రభుత్వ న్యాయవాదులురామకృష్ణారావు,ఉపేందర్‌రావునిందితులకుశిక్షపడేలావాదనలు వినిపించారు.

## ఆర్య వైశ్య మహాసభ నూతన కార్యవర్గానికి రవికుమార్ యాదవ్ అభినందనలు



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మండల ఆర్య వైశ్య మహాసభ నూతన కార్యవర్గానికి ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ అభినందనలు తెలిపారు. మంగళవారం మసీద్ బండలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు ప్రభాకర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి శూల్యలింగం, ఉపాధ్యక్షులు సందీప్, జగన్మోహన్ గుప్తా తదితరులను రవికుమార్ యాదవ్ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కార్యవర్గం మండల అభివృద్ధితో పాటు ఆర్య వైశ్య సంఘ సభ్యుల సంక్షేమానికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని అన్ని ఆర్య వైశ్య సంఘాలను, సభ్యులను కలుపుకొని ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. భవిష్యత్తులో సంఘానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని రవికుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ రాజు గుప్తా, అశోక్ గుప్తా, పాండు గుప్తా, రేఖ, ఆనంద్ గుప్తా, సంతోష్, కమలాకర్, కిషోర్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా తదితర ఆర్య వైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# విశ్వేజి



## నమ్మండి ... ఈ అలవాట్లతో మీరు యవ్వనంగా ఉంటారు!

ఆరోగ్యంగాను, యవ్వనంగానూ ఉండాలని ఎవరు మాత్రం కోరుకోరు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా, యవ్వనంగా ఉండాలనుకుంటారు. అటువంటివారు ఒక ఎనిమిది అలవాట్లను చేసుకుంటే యవ్వనంగా ఉంటారు. వృద్ధాప్యం రాకుండా ఎక్కువ కాలం జీవిస్తారు. మరి ఆ అలవాట్లు ఏమిటో తెలుసుకుందాం. మన హృదయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వల్ల మన వయసు కూడా కాస్త తగ్గినట్టుగా ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆహారం విషయంలో జాగ్రత్త అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఈ నేపథ్యంలోనే ఎక్కువ కాలం యవ్వనంగా ఉండడం కోసం అవసరమైన అలవాట్లను వెల్లడించింది. వృద్ధాప్యాన్ని తగ్గించే రోజువారి అలవాట్లలో ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. పండ్లు, కూరగాయలు, మాంసకృత్తులు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ట్రాన్స్ ఫ్యాట్స్, వేయించిన ఆహారాలు, చక్కెర ఆహారాలను తగ్గించాలి. యవ్వనంగా ఉండాలంటే వీటికి దూరంగా ఉండండి యవ్వనంగా ఉండాలనుకునే వారు వ్యాయామం రెగ్యులర్ గా చేయాలి. డయాబెటిస్, రక్తపోటు, కొలెస్ట్రాల్ ను తగ్గించడానికి ప్రతిరోజు వ్యాయామం చేయడం సూచించబడింది. ఇక యవ్వనంగా ఆరోగ్యంగా ఉండాలనుకునే వారు ధూమపానాన్ని మానుకోవాలి. ధూమపానం మద్యపానం ఆరోగ్యం పైన ప్రభావం చూపి త్వరగా వృద్ధాప్యం వచ్చేలా చేస్తాయి. కనుక వీటికి దూరంగా ఉండాలి. నిద్ర, బరువు, కొలెస్ట్రాల్ కంట్రోల్ తో యవ్వనం యవ్వనంగా ఉండాలని భావించేవారు ప్రతిరోజు ఏడు నుంచి ఎనిమిది గంటల నాణ్యమైన నిద్ర పోవాలి. ఒకవేళ సరైన నిద్రపోకుంటే అది ఊబకాయానికి దారి తీస్తుంది. కనుక జాగ్రత్త వహించాలి. ఇక యవ్వనంగా కనిపించాలి అనుకునేవారు బరువును నియంత్రించాలి. ఆరోగ్యకరమైన బరువును మెయింటైన్ చేస్తే వయసు తగ్గినట్టు కనిపిస్తుంది. యవ్వనంగా కనిపించాలని భావించేవారు కొలెస్ట్రాల్ ను తగ్గించుకోవాలి. పాదాలలో ఈ లక్షణాలు కనిపిస్తే డేంజర్ బెల్స్ మోగినట్టే.. జాగ్రత్త! గ్యాస్ట్రిక్ సమస్యలు రాకుండా చూసుకోవాలి. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగితే గుండెపోటు స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంటుంది. బ్లడ్ షుగర్ ని ఎప్పటికప్పుడు నియంత్రణలో ఉంచుకోవాలి. డయాబెటిస్ కంట్రోల్ లో ఉంటే ఆరోగ్యంతో పాటు యవ్వనంగా కూడా ఉంటారు. ఇక రక్తపోటును అదుపులో ఉంచుకుంటే వృద్ధాప్య ప్రక్రియను స్లో చేయడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి యవ్వనంగా ఉండాలని భావించేవారు పైన సూచించిన అలవాట్లను తప్పనిసరిగా చేసుకోండి.

# ఉదయాన్నే గుప్పెడు ఈ సీడ్స్ తింటే చాలు..



### కొలెస్ట్రాల్ వెన్నలా కరిగిపోవాల్సిందే!

ప్రకృతి మనకు అందించిన అద్భుతమైన ఆహారాలలో పొద్దుతిరుగుడు విత్తాలు ఒకటి. ఇవి చూడ్డానికి చిన్నగా కనిపించినా.. ఈ గింజల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే వీటిని సూపర్ ఫుడ్ అని కూడా పిలుస్తారు. చాలా మంది పొద్దుతిరుగుడు విత్తనాలను స్నాక్స్‌గా తింటారు. కానీ వీటిని ఉదయాన్నే తినడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయి. శరీరం రోజంతా ఆరోగ్యంగా , శక్తివంతంగా ఉండటానికి సహాయపడుతుంది. పొద్దుతిరుగుడు విత్తనాల్లో పోషకాలు ముఖ్యంగా పొద్దుతిరుగుడు విత్తనాల్లో విటమిన్ ఇ, మెగ్నీషియం, సెలీనియం, లినోలెయిక్ ఆమ్లం (ఒమేగా-6 కొవ్వు ఆమ్లం), ప్రొటీన్లు, ఫైబర్ , అనేక ఇతర ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ పోషకాలన్నీ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శక్తిని పెంచుతాయి: ఉదయం పూట పొద్దుతిరుగుడు విత్తనాలను తినడం వల్ల మీకు తక్షణ శక్తి లభిస్తుంది. వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల రోజంతా శక్తివంతంగా ఉండటానికి సహాయపడతాయి. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు వీటిని తీసుకోవడం వల్ల మీరు రోజంతా ఉత్సాహంగా ఉంటారు. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి: ఈ విత్తనాల్లో లినోలెయిక్ ఆమ్లం (ఒమేగా-6 కొవ్వు ఆమ్లం) ఉంటుంది, ఇది గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, వీటిలో ఉండే మెగ్నీషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది, తద్వారా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతాయి: పొద్దుతిరుగుడు విత్తనాల్లో విటమిన్ ఇ, సెలీనియం వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి, కణాలను నష్టం నుండి రక్షిస్తాయి. తద్వారా రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. వ్యాధుల నుండి శరీరాన్ని కాపాడతాయి. చర్మం , జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి: దీనిలోని విటమిన్ ఇ చర్మానికి, జుట్టుకు చాలా మంచిది. ఇది చర్మాన్ని తేమగా ఉంచడానికి, మృదువుగా చేయడానికి , యవ్వనంగా కనిపించేలా చేయడానికి సహాయపడుతుంది. అలాగే, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను ఉదయం తినడం వల్ల మీ చర్మం, జుట్టు ఆరోగ్యంగా, అందంగా ఉంటాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి: పొద్దుతిరుగుడు విత్తనాల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి సహాయపడుతుంది. ఉదయం పూట వీటిని తినడం వల్ల మీ జీర్ణ వ్యవస్థ రోజంతా సక్రమంగా పనిచేస్తుంది. మీరు తేలికగా మరియు ఆరోగ్యంగా ఉంటారు. పొద్దుతిరుగుడు విత్తనాల్లో ఫైబర్ , ప్రొటీన్లు పుష్కలంగా ఉండటం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది . ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది. తద్వారా మీరు తక్కువగా ఆహారం తీసుకుంటారు . బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో వీటిని చేర్చుకోవడం వల్ల మీరు ఆరోగ్యకరమైన బరువును నిర్వహించవచ్చు. ఎముకలను బలంగా చేస్తాయి: దీనిలోని మెగ్నీషియం , ఫాస్పరస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఎముకలను బలంగా చేయడానికి , ఎముకల సాంద్రతను పెంచడానికి సహాయపడతాయి. వయసు పెరిగే కొద్దీ ఎముకలు బలహీనపడకుండా ఉండటానికి పొద్దుతిరుగుడు విత్తనాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి: పొద్దుతిరుగుడు విత్తనాల్లో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది, ఇది సెరోటోనిన్ ఉత్పత్తికి అవసరం. సెరోటోనిన్ ఒక న్యూరోట్రాన్స్మిటర్, ఇది మానసిక స్థితిని మెరుగుపరచడానికి మరియు ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. ఉదయం పూట పొద్దుతిరుగుడు విత్తనాలను తినడం వల్ల మీరు రోజంతా ప్రశాంతంగా మరియు సంతోషంగా ఉంటారు. పొద్దుతిరుగుడు విత్తనాలను ఉదయం ఎలా తినాలి? పొద్దుతిరుగుడు విత్తనాలను ఉదయం తినడానికి చాలా మంచిది. నేరుగా గుప్పెడు పొద్దుతిరుగుడు విత్తనాలను తినవచ్చు. వీటిని వేయించి లేదా పచ్చిగా కూడా తినవచ్చు. వేయించిన విత్తనాలు రుచిగా ఉంటాయి, కానీ పచ్చి విత్తనాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. మీ ఉదయపు ఓట్‌మీల్‌లో పొద్దుతిరుగుడు విత్తనాలను కలపండి. ఇది ఓట్‌మీల్‌కు రుచిని, పోషకాలను జోడిస్తుంది . అంతే కాకుండా యోగర్ట్‌లో పొద్దుతిరుగుడు విత్తనాలను కలపండి. ఇది యోగర్ట్‌కు కరకరలాడే ఆకృతిని , పోషకాలను జోడిస్తుంది. ఉదయపు స్మూతీస్‌లో పొద్దుతిరుగుడు విత్తనాలను కలపండి. ఇది స్మూతీస్‌కు పోషకాలను , చిక్కదనాన్ని జోడిస్తుంది. అంతే కాకుండా ఉదయం సలాడ్స్‌లో పొద్దుతిరుగుడు విత్తనాలను కలపండి. ఇది సలాడ్స్‌కు రుచిని మరియు పోషకాలను జోడిస్తుంది.

# రక్తపోటును సహజంగా తగ్గించి నైట్రిక్ ఆక్సైడ్ పెంచే సూపర్ ఫుడ్స్ ఇవే!



రక్తపోటు పెరగడం అనేది నేడు చాలా మందిని వేధిస్తున్న ఒక సమస్య. దీనిని నిర్లక్ష్యం చేస్తే గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి ప్రమాదకర పరిస్థితులకు దారితీయవచ్చు. అయితే, సరైన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తపోటును సహజంగా తగ్గించుకోవచ్చు , నైట్రిక్ ఆక్సైడ్ స్థాయిలను పెంచుకోవచ్చు. ఈ నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలను వెడల్పు చేసి రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, తద్వారా రక్తపోటు తగ్గుతుంది. రక్తపోటును తగ్గించడానికి, నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచడానికి సహాయపడే కొన్ని అద్భుతమైన ఆహారాలను తెలుసుకుందాం.. నైట్రిక్ ఆక్సైడ్ - రక్తపోటు మధ్య సంబంధం: నైట్రిక్ ఆక్సైడ్ మన శరీరంలో సహజంగా ఉత్పత్తి అయ్యే ఒక ముఖ్యమైన అణువు. ఇది రక్తనాళాల లోపలి పొరలో ఉత్పత్తి అవుతుంది. రక్తనాళాలను విశ్రాంతింపజేయడంలో సహాయపడుతుంది. రక్తనాళాలు వెడల్పుగా ఉన్నప్పుడు, రక్తం మరింత స్వేచ్ఛగా ప్రవహిస్తుంది, తద్వారా రక్తపోటు తగ్గుతుంది. తక్కువ నైట్రిక్ ఆక్సైడ్ స్థాయిలు రక్తనాళాల సంకోచానికి దారితీస్తాయి, ఇది రక్తపోటును పెంచుతుంది. రక్తపోటును తగ్గించి నైట్రిక్ ఆక్సైడ్ పెంచే ఆహారాలు: ఆకుకూరలు: పాలకూర, బచ్చలికూర, మెంతి కూర, తోటకూర వంటి ఆకుకూరలు నైట్రేట్‌లకు గొప్ప మూలం. ఈ నైట్రేట్‌లు శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మార్చబడతాయి. ఒక అధ్యయనం ప్రకారం, రోజుకు ఒక కప్పు ఆకుకూరలు తినడం ద్వారా రక్తపోటు గణనీయంగా తగ్గుతుంది. వీటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి, ఇవి మొత్తం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. బీట్‌రూట్: బీట్‌రూట్ కూడా నైట్రేట్‌లకు అద్భుతమైన మూలం. బీట్‌రూట్ జ్యూస్ తాగడం లేదా బీట్‌రూట్‌ను ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచవచ్చు. అధ్యయనాలు బీట్‌రూట్ జ్యూస్ రక్తపోటును త్వరగా తగ్గించగలదని నిరూపించాయి. బీట్‌రూట్‌లో ఫోలేట్, పొటాషియం, ఫైబర్ కూడా ఉంటాయి, ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. వెల్లుల్లి ఉల్లిపాయలు: వెల్లుల్, ఉల్లిపాయలు అల్లిసిన్ అనే సమ్మేళనాన్ని కలిగి ఉంటాయి, ఇది నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది. వెల్లుల్లి రక్తనాళాలను వెడల్పు చేయడమే కాకుండా రక్తం గడ్డకట్టకుండా కూడా సహాయపడుతుంది. ప్రతిరోజు ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బలు తినడం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయలు కూడా రక్తపోటును తగ్గించడంలో సహాయపడే క్వెర్సెటిన్ అనే యాంటీఆక్సిడెంట్‌ను కలిగి ఉంటాయి. దానిమ్మ: దానిమ్మ పండ్లు యాంటీఆక్సిడెంట్లకు, పాలీఫెనాల్స్‌కు గొప్ప మూలం. దానిమ్మ రసం నైట్రిక్ ఆక్సైడ్ బయోయాక్టివిటీని పెంచుతుంది. రక్తపోటును తగ్గిస్తుంది. దానిమ్మలో ఉండే ప్యూనికాలగిన్స్ రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. రోజుకు ఒక గ్లాసు దానిమ్మ రసం తాగడం రక్తపోటును నియంత్రించడానికి ఒక రుచికరమైన మార్గం. బెర్రీలు: స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీలు , బ్లాక్‌బెర్రీలు వంటి బెర్రీలు ఫ్లేవనాయిడ్స్‌లో సమృద్ధిగా ఉంటాయి. ఈ ఫ్లేవనాయిడ్స్ నైట్రిక్ ఆక్సైడ్ స్థాయిలను పెంచడంలో, రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. బెర్రీలు యాంటీఆక్సిడెంట్లకు గొప్ప మూలం, ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడతాయి. రోజూ ఒక కప్పు బెర్రీలు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. పుచ్చకాయ: పుచ్చకాయలో ఎల్-సిట్రులిన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది శరీరంలో ఎల్-ఆర్జినైన్‌గా మార్చబడుతుంది, ఇది నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తికి అవసరం. పుచ్చకాయ తినడం వల్ల నైట్రిక్ ఆక్సైడ్ స్థాయిలు పెరుగుతాయి. రక్తపోటు తగ్గుతుంది. పుచ్చకాయ వేసవిలో లభించే ఒక రిఫ్రెష్, ఆరోగ్యకరమైన పండు. నట్స్ , విత్తనాలు: వాల్నట్స్, బాదం, గుమ్మడికాయ విత్తనాలు, చియా విత్తనాలు వంటి నట్స్, విత్తనాలు ఎల్-ఆర్జినైన్‌కు మంచి మూలం. ఎల్-ఆర్జినైన్ నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తికి అవసరమైన అమైనో ఆమ్లం. నట్స్, విత్తనాలలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ , ఇతర పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. రోజుకు ఒక గుప్పెడు నట్స్ లేదా విత్తనాలు తినడం ఆరోగ్యకరమైన అలవాటు. సిట్రస్ పండ్లు: నారింజ, నిమ్మ, ద్రాక్షపండు వంటి సిట్రస్ పండ్లు విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లకు గొప్ప మూలం. విటమిన్ సి నైట్రిక్ ఆక్సైడ్ బయోయాక్టివిటీని మెరుగుపరుస్తుంది. రక్తనాళాల పనితీరును మెరుగుపరుస్తుంది. సిట్రస్ పండ్లు రక్తపోటును తగ్గించడంలో , గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

# మార్కెట్

## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. టారిఫ్ నుంచి పలు దేశాలకు ఊరట కల్పిస్తామన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంకేతాలతో స్టాక్ మార్కెట్లు ఉదయం లాభాల్లో ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 78వేల పాయింట్లు దాటింది. ఈ క్రమంలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. దాంతో ఆరంభంలో వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. చివరలో స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ క్రితం సెషన్‌తో పోలిస్తే 78,296.28 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 78,741.69 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. కనిష్ఠంగా 77,745.63 పాయింట్లను తాకింది. చివరకు 32.8 పెరిగి 78,017.19 వద్ద ముగిసింది. నిఫ్టీ 10.30 పాయింట్లు పెరిగి.. 23,668.65 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో దాదాపు 1,019 షేర్లు పెరగ్గా.. 2,868 షేర్లు పతనమయ్యాయి. ఐటీ మినహా, మిగతా అన్ని రంగాల సూచీలు ఆటో, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, ఆయిల్, గ్యాస్, పవర్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ, టెలికాం షేర్లు ఒకటి నుంచి 1.5శాతం పతనమయ్యాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ నిఫ్టీలో లాభాలను ఆర్జించాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, కోల్ ఇండియా, అదానీ పోర్ట్స్ నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.6 శాతం పతనమయ్యాయి.



# ఆపిల్ నుంచి అదరిపోయేలా మడతపెట్టే ఫోన్..!



ఆపిల్ కంపెనీ చాలాకాలంగా 4-మోడల్ ఐఫోన్ సిరీస్‌ను కొనసాగిస్తున్నది. ఈ ఏడాది నుంచి మార్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆపిల్ ఈ ఏడాది ఐఫోన్ 17 ఎయిర్‌ను విడుదల చేయాలని యోచిస్తున్నది. ఇది ప్లస్ వేరియంట్‌ని భర్తీ చేయనున్నది. ఈ ట్రెండ్‌ను కొనసాగిస్తూ.. కంపెనీ 2026 కంపెనీ తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ని విడుదల చేసే అవకాశం ఉన్నది. కొత్త బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. ఆపిల్ ఈ డివైజ్ కోసం క్లామ్‌షెల్ (ఫ్లిప్) డిజైన్ కాకుండా శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్ తరహాలో బుక్ స్టయిల్ డిజైన్‌ను తీసుకురానున్నది. నివేదిక ప్రకారం.. ఐఫోన్ ఫోల్డబుల్ శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్‌ని పోలి ఉండనున్నట్లు తెలుస్తున్నది. డిజైన్ ఐఫోన్ 17 ఎయిర్ నుంచి ప్రేరణగా తీసుకోనున్నది. ఆపిల్ త్వరలో తీసుకురానున్న ఐఫోన్ 17 ఎయిర్ అల్ట్రా సిమ్‌గా తెలుస్తున్నది. కేవలం 5.5 ఎంఎం మందం మాత్రమే ఉండనున్నట్లు తెలుస్తున్నది. దాంతో కెమెరా, స్పీకర్ క్వాలిటీలో రాజీ పడక తప్పదని నివేదిక పేర్కొంది. కానీ, బ్యాటరీ లైఫ్ ఐఫోన్ 16ఈ తరహాలోనే ఉంటుంది. ఇక ఐఫోన్ 17 ఎయిర్ వినూత్న డిజైన్‌ను ఆపిల్ భవిష్యత్ ఫోల్డబుల్ ఐఫోన్‌కు పునాదిగా భావిస్తున్నది. లీకుల ప్రకారం.. ఐఫోన్ ఫోల్డబుల్ పూర్తిగా తెరిచిన సమయంలో 7.8 ఇంచెస్ మెయిన్ డిస్‌ప్లే, 5.5 ఇంచెస్ ఎక్స్‌టర్నల్ స్క్రీన్‌తో వస్తుంది. స్ట్రాంగ్, డ్యూరబుల్‌తో ఫోన్‌ని తీసుకువచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందు కోసం లిక్విడ్ మెటల్‌ని ఉపయోగించనున్నట్లు సమాచారం. ఫోల్డబుల్ ఫోన్ ఓపెన్ చేసిన సమయంలో 4.5 ఎంఎం.. మతపెట్టిన సమయంలో 9 ఎంఎం నుంచి 9.5 ఎంఎం మందం ఉండనున్నది. ఇదే నిజమైతే ఇప్పటి వరకు ఉన్న ఫోల్డబుల్ ఫోన్‌లలో ఇదే స్లిమ్ ఫోన్‌గా మారనున్నది. ఇక ఆపిల్ ఫేస్ టచ్ ఐడీకి బదులుగా టచ్ ఐడీ సెన్సార్‌ను తీసుకురానున్నట్లు తెలుస్తున్నది. ఫోన్ క్వాలిటీని మెరుగుపరిచేందుకు టైటానియం ఛాసిస్‌ను ఉపయోగించవచ్చని తెలుస్తున్నది. దాంతో మొబైల్ తక్కువ బరువుతో ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ అందించనుంది. ఇప్పటి వరకు మొబైల్ స్పెసిఫికేషన్స్‌ను ఆపిల్ వెల్లడించలేదు. కేవలం ఇవన్నీ లీకులు మాత్రమే. ఇక ఈ మొబైల్ ధర అమెరికాలో 2,300 డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.1.91లక్షలుగా ఉండనున్నట్లు తెలుస్తున్నది.

## మార్కెట్లకు ఎఫ్ఐఐల కిక్కు

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుస లాభాలు కొనసాగుతున్నాయి. సోమవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,078.87 పాయింట్లు లేదా 1.40 శాతం ఎగిసి 77,984.38 వద్ద స్థిరపడింది. ఇది 6 వారాల గరిష్ఠం కావడం విశేషం. ఒకానొక దశలో 1,200 పాయింట్లకుపైగా పెరిగి 78,107.23 పాయింట్లదాకా ఎగబాకింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ కూడా 307.95 పాయింట్లు పుంజుకొని 23,658.35 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో 23,708.75 స్థాయిని తాకింది. దీంతో వరుసగా ఆరోరోజూ మార్కెట్లు లాభాల్లోనే ముగిసినైట్టెంది. అమెరికా, ఐరోపా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడం కలిసొచ్చింది. ముఖ్యంగా ఏప్రిల్ 2 నుంచి భారత్, చైనాసహా అనేక దేశాలపై ప్రతీకార సుంకాలుంటాయని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. పునరాలోచనలోపడటం ఇన్వెస్టర్లను మెప్పించిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. పైగా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను రాబోయే ద్రవ్యసమీక్షల్లో తగ్గిస్తుందన్న అంచనాలూ గట్టిగానే ఉన్నాయి. ఇవి ఆర్బీఐ వడ్డీరేట్ల కోతలకు దోహదం చేస్తాయని అభిప్రాయపడుతున్నారు. అలాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ క్రమేణా పెరుగుతుండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. ఇక విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ మార్కెట్లలో మళ్లీ పెట్టుబడులకు ఆసక్తి కనబరుస్తుండటం కూడా సూచీలను పరుగులు పెట్టిస్తున్నది. గత 6 రోజుల్లో ఎఫ్ఐఐల నికర పెట్టుబడులు రూ.8,874.88 కోట్లుగా ఉన్నాయి. నిజానికి గత 5 నెలల్లో రూ.2.5 లక్షల కోట్లు వెనక్కి తీసుకున్నారు. మరోవైపు బ్యాంకింగ్, యుటిలిటీస్, పవర్, ఇండస్ట్రియల్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ రంగాల షేర్లు 2.53 శాతం వరకు లాభపడ్డాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ 1.32 శాతం, స్మాల్‌క్యాప్ 1.17 శాతం చొప్పున పెరిగాయి. సెన్సెక్స్‌లో ఎన్టీపీసీ షేర్ విలువ అత్యధికంగా 4.61 శాతం పెరిగింది. ఆసియా మార్కెట్లలో చైనా, హాంకాంగ్ లాభాల్లో ముగియగా, దక్షిణ కొరియా, జపాన్ సూచీలు నష్టపోయాయి. 27.10 లక్షల కోట్లు జూమ్.. స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో కదలాడుతుండటంతో మదుపరుల సంపద కూడా అంతకంతకూ పెరుగుతూపోతున్నది. గత 6 రోజుల్లో బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.27.10 లక్షల కోట్లు ఎగబాకింది. ఈ 6 రోజుల్లో సెన్సెక్స్ 4,155.47 పాయింట్లు లేదా 5.62 శాతం, నిఫ్టీ 1,261.15 పాయింట్లు లేదా 5.63 శాతం ఎగిశాయి. ముఖ్యంగా నాలుగేండ్ల తర్వాత గత వారం మార్కెట్లు అత్యుత్తమ లాభాలను అందుకున్నాయి. ఐదు రోజుల్లో సెన్సెక్స్ 3,077 పాయింట్లు, నిఫ్టీ 953 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే ఆయా కంపెనీల మార్కెట్ విలువ కూడా రూ.27,10,918.98 కోట్లు పుంజుకొని రూ.4,18,29,351.91 కోట్లకు చేరింది.

# ఆంధ్రప్రదేశ్

## నిర్మలాసీతారామన్‌కు బాబు, లోకేశ్ శుభాకాంక్షలు

అమరావతి,ఆగస్ట్18 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జన్మదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని దేవుడిని ప్రార్థించారు. అపారమైన శక్తితో దేశ ప్రగతిని ఆమె ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా చంద్రబాబు, లోకేశ్ పోస్టు పెట్టారు. 'గౌరవనీయ కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఆయురారోగ్యాలతో సంతోషంగా నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటున్నాను. దేశ ప్రగతికి మీరు అదే అంకితభావం, అవిశ్రాంత శక్తితో మార్గనిర్దేశర చేస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. నిర్మలా సీతారామన్‌కు మంత్రి నారా లోకేశ్ కూడా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి ఆమె అందిస్తున్న విశిష్ట సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. కేంద్ర మంత్రికి మంచి ఆరోగ్యం, సంతోషం, మరింత శక్తి లభించాలని దేవుడిని కోరారు. రాబోయే ఏడాది మరిన్ని విజయాలు సాధించాలని లోకేశ్ ప్రార్థించారు.

## రోడ్డు పనుల్లో తవ్వుతుండగా రెండు శవాలు లభ్యం

విశాఖపట్నం,ఆగస్ట్18 : నగరంలోని షీలా నగర్‌లో రెండు మృతదేహాలు లభ్యమవడం తీవ్ర కలకలం రేపుతోంది. షీలానగర్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న షీలానగర్-సబ్బవరం పోర్టు కనెక్టివిటీ రోడ్డు పనుల్లో భాగంగా రెండు గుర్తుతెలియని శవాలు లభించాయి. మంగళవారం డంపర్ లారీలు మట్టి వేస్తుండగా కుప్పలో 2 శవాలు కనిపించాయి. దీంతో సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. వారు అక్కడకు చేరుకుని ఘటనా స్థలిని పరిశీలించారు. ఒకటి మహిళ మృతదేహం కాగా మరొకటి పురుషుడి మృతదేహంగా గుర్తించారు. రెండు మృతదేహాలూ పూర్తిగా డికంపోజ్ అయినట్లు తెలిపారు. అంతేకాకుండా.. మట్టిలో పాత తలగడలు, బొంతలు, పూలమాలలు, చెక్కలు లభ్యమయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రోడ్డు పనుల్లో భాగంగా ఉపయోగించిన మట్టి.. శ్మశానం నుంచి తీసుకొచ్చినట్లుగా అనుమానిస్తున్నామని ఏసీపీ శ్రీనివాసరావు వెల్లడించారు.

## స్థానిక ఎన్నికల్లో అసెంబ్లీ ఫలితాలో రిపీట్

బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు జోస్యం

విశాఖపట్నం,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):స్థానిక సంస్థల ఎన్నికల్లో 2024 ఫలితాలే రిపీట్ అవుతాయని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు జోస్యం చెప్పారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కూడా కూటమి కైవసం చేసుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మంగళవారం విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి డబుల్ స్టాండ్ ప్లే చేస్తున్నారని మండిపడ్డారు. శాసనమండలికి వైసీపీ ఎమ్మెల్సీలు వస్తున్నారు.. కానీ శాసనసభకు డుమ్మా కొడుతున్నారని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఎవరో మిస్ గైడ్ చేస్తున్నారని అన్నారు. వైసీపీని నాశనం చేయడానికి ఎవరో ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే .. అసెంబ్లీకి వస్తానని జగన్ చెప్పడం సరికాదని అభిప్రాయపడ్డారు. సెంబ్లీకి వస్తే తనకు మాట్లాడే సమయం ఇవ్వరని వైఎస్ జగన్ ఊహాజనితమైన భావనలో ఉన్నారన్నారు. అసెంబ్లీలో తమ సమయం కూడా.. మీకే ఇస్తామని జగన్మోహన్ రెడ్డికి ఆఫర్ కూడా ఇచ్చామని గుర్తు చేశారు. అయినా వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి రాలేదని అసహనం వ్యక్తం చేశారు. ÷ఔటమి ప్రభుత్వంలో ఎటువంటి అరాచకాలు ఉండవని ఆయన కుండబద్దలు కొట్టారు. .. దయచేసి అసెంబ్లీకి రావాలని జగన్‌కు స్పష్టం చేశారు. అసెంబ్లీకి రాని వైసీపీ ఎమ్మెల్యేలకు.. ప్రజలు ఎందుకు ఓటు వేయాలంటూ బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్ రాజు సందేహం వ్యక్తం చేశారు.

## 20 నుంచి సిఎం రేవంత్ విదేశీ పర్యటన

హైదరాబాద్,ఆగస్ట్18 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. ఆగస్టు 20 నుంచి 30వ తేదీ వరకు లండన్, అమెరికాలో సీఎం పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలను సందర్శించడంతో పాటు వివిధ సమావేశాల్లో పాల్గొననున్నారు. ఆగస్టు 20వ తేదీ అర్ధరాత్రి 12:30 గంటలకు న్యూఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరనున్నారు. ఆగస్టు 20 ఉదయం 7 గంటలకు యూకే స్థానిక కాలమానం ప్రకారం లండన్ చేరుకోనున్నారు. ఆగస్టు 21న ఉదయం 10:30 గంటలకు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం సందర్శించనున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు ఫుట్‌బాల్ ప్రెజెంటేషన్ కార్యక్రమం కోసం ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు. 22న ఉదయం 10:30 గంటలకు కేంబ్రిడ్జ్ బృందంతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు. ఉదయం 11:30 గంటలకు లండన్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని సెనేట్ హౌస్‌ను సందర్శించ నున్నారు. సాయంత్రం 4 గంటలకు లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శించనున్నారు. యూకే పర్యటన అనంతరం ఆగస్టు 23న సీఎం రేవంత్ రెడ్డి లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు బయలుదేరి వెళతారు. అక్కడ కూడా పలు ప్రముఖ విద్యా సంస్థలను సందర్శించి సమావేశాల్లో పాల్గొననున్నారు. 24న ఉదయం 10:30 గంటలకు హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సీఎం సందర్శించనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎంఐటి క్యాంపస్‌ను సందర్శిస్తారు. అదే రోజు రాత్రి 7 గంటలకు బాస్టన్ నుంచి న్యూయార్క్‌కు బయలుదేరనున్నారు. 25న ఉదయం 10:30 గంటలకు నోర్త్-ఈస్టర్న్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సీఎం సందర్శించనున్నారు. సాయంత్రం 4 గంటలకు వర్జీనియా టెక్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందంతో సమావేశం కానున్నారు. 26న న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు, వివిధ వర్గాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యే అవకాశం ఉంది. అమెరికా పర్యటన ముగించుకుని ఆగస్టు 29న న్యూయార్క్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. 30న హైదరాబాద్ చేరుకోనున్నారు. మొత్తంగా సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో యూకే, అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, బిజినెస్ స్కూళ్లను సందర్శించడంతో పాటు పలు ప్రతినిధి బృందాలతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ పర్యటన ద్వారా విద్య, పరిశ్రమలు, పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు సంబంధించిన అంశాలపై చర్చలకు అవకాశం ఉండనుంది.

# ఓర్వకల్లు డ్రోన్ సిటీకి ప్రపంచవ్యాప్త గుర్తింపు

**అన్నిరంగాల్లో పెరిగిన డ్రోన్ వినియోగం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో పారిశ్రామికవేత్తల రాక**

**డ్రోన్ల ఎగుమతితో పెరగనున్న దేశ ఖ్యాతి**

**డ్రోన్ కంపెనీల సిఇవోలతో రామ్మోహన్ నాయుడు భేటీ**



కర్నూలు : డ్రోన్ సిటీకి దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు రానుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుఅన్నారు. అన్ని రంగాల్లో ఇప్పుడు డ్రోన్‌ల వినియోగం పెరిగిందని పేర్కొన్నారు. కర్నూలు సమీపంలోని ఓర్వకల్లు మండలం పాలకొలను వద్ద ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీలో వివిధ డ్రోన్ సంస్థలకు చెందిన సీఈవోలతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో 6 లక్షల డ్రోన్‌ల అవసరం ఉండగా.. ప్రస్తుతం 40 వేల డ్రోన్లు మాత్రమే ఉన్నాయని వివరించారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ చూసి.. డ్రోన్ కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. ఓర్వకల్లులో 600 ఎకరాల్లో డ్రోన్ సిటీ ఏర్పాటు అవుతుందని తెలిపారు. ఈ సిటీలో డ్రోన్ల తయారీ, ప్రొడక్షన్, శిక్షణ అన్ని ఉంటాయని వివరించారు. ఇక్కడ ఏర్పాటు చేసే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు ఉంటాయని అన్నారు. డ్రోన్ శక్తిని వాటి పనితీరును ప్రధాని మోదీ గుర్తించారని చెప్పారు. మన టెక్నాలజీని ఉపయోగించి మనమే డ్రోన్ తయారు చేసి.. విదేశాలకు ఎగుమతి చేయాలని ప్రధాని మోదీ సంకల్పించారని గుర్తు చేశారు. విదేశాల నుంచి డ్రోన్ల దిగుమతిని కేంద్రం నిషేధించిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భారతదేశంలోనే తొలి అతిపెద్ద డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వివిధ డ్రోన్ కంపెనీలతో సమీక్ష నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకోంటామని తెలిపారు. 150 కంపెనీలకు చెందిన డ్రోన్ సంస్థల ప్రతినిధులతో ఈ కార్యక్రమం నిర్వహిచడం పట్ల కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే అసెంబ్లీలో డీఎస్సీ-2025పై చర్చకు రావాలని మంత్రి నారా లోకేశ్ ఆహ్వానిస్తే.. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తప్పించుకుని తిరుగుతున్నారని రామ్మోహన నాయుడు ఎద్దేవా చేశారు. మంత్రి లోకేశ్ సవాల్ స్వీకరించి.. అసెంబ్లీలో చర్చకు రావాలని వైఎస్ జగన్‌కు ఆయన స్పష్టం చేశారు. ఓర్వకల్లులో కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు మాట్లాడుతూ.. మెగా డీఎస్సీపై అసెంబ్లీలో చర్చకు లోకేశ్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అసెంబ్లీకి వస్తే తన కుట్ర బయట పడుతోందనే భయంతో వైఎస్ జగన్.. చర్చకు రావడం లేదన్నారు. కూటమిపై దుష్ప్రచారం చేసి.. తన ఉనికిని కాపాడుకోవాలని వైఎస్ జగన్ చూస్తున్నారని విమర్శించారు. టీచర్లను లిక్కర్ షాపుల వద్ద నిలబెట్టిన వ్యక్తి వైఎస్ జగన్ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. టీచర్లను చూస్తే వైఎస్ జగన్‌కి కోపం, కక్ష అని చెప్పారు. మెగా డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు లేకుండా.. పూర్తి పారదర్శకంగా వేలాది టీచర్ల పోస్టులు భర్తీ చేశామని కేంద్ర మంత్రి వివరించారు. ఏ ప్రభుత్వం చేయని టీచర్ ఉద్యోగాలు.. తాము భర్తీ చేశామని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు తీసుకురావడానికి మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్లలోనే ఏపీలో ఊహించని అభివృద్ధి జరిగిందని రామ్మోహన నాయుడు తెలిపారు.

## మండలిలో రచ్చ చేసేందుకే వచ్చారా

### వైకాపా సభ్యుల తీరుపై మండిపడ్డ కేశవ్

అమరావతి,ఆగస్ట్18 : శాసన మండలిలో ప్రజా సమస్యలపై మాట్లాడకుండా, అల్లరి చేసి సభ నుంచి వెళ్లిపోవాలనేది వైకాపా సభ్యుల ఉద్దేశంగా కనిపిస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. మండలి సమావేశాల్లో రెండోరోజు కూడా డీఎస్సీ అంశంపై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం నడిచింది. ఛైర్మన్ మోషేను రాజు అధ్యక్షతన కార్యకలాపాలు ప్రారంభం కాగానే... డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని వైకాపా సభ్యులు వాయిదా తీర్మానం ఇచ్చారు. వాయిదా తీర్మానం తిరస్కరించిన మండలి ఛైర్మన్... ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. దీంతో వైకాపా సభ్యులు ఛైర్మన్ పోడియం చుట్టూ చేరి ఆందోళనకు దిగారు. ప్రశ్నోత్తరాల సమయంలోనే మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణకు ఛైర్మన్.. మాట్లాడే అవకాశమిచ్చారు. శాసనమండలిలో డీఎస్సీ గురించి చర్చ కోరుతుంటే ప్రభుత్వం ఎందుకు వెనుకంజ వేస్తుందని బొత్స ప్రశ్నించారు. వేరే ఫార్మాట్లో రావాలని బొత్సకు ఛైర్మన్ చెప్పినా పట్టించుకోలేదు. దీంతో వైకాపా సభ్యుల తీరుపై శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్మన్‌ను అగౌరవపరిచేలా ప్రతిపక్ష సభ్యులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎలా నడపాలనేది ప్రజలు నిర్ణయించారని... ప్రజాతీర్పు ప్రకారమే సభను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఎల్‌నినో సమస్య తీవ్రంగా ఉండి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు కాబట్టి.. ఆ అంశంపై ముందు చర్చించి.. డీఎస్సీ గురించి తర్వాత మాట్లాడతామన్నారు. డీఎస్సీ చాలా ముఖ్యమైన విషయమని బొత్స వాదనకు దిగేందుకు ప్రయత్నించగా... పయ్యావుల తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. డీఎస్సీ అంటేనే తెలుగుదేశమని... 14సార్లు డీఎస్సీ ఇచ్చామని తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా పని చేసి ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని బొత్స... ఇప్పుడు డీఎస్సీపై, నిరుద్యోగులపై ప్రేమ ఉన్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... డీఎస్సీపై శాసనసభలో మాట్లాడి, మండలిలో చర్చించేందుకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. వాస్తవ విషయాలు శాసనసభ మాదిరిగానే మండలిలోనూ చర్చించాలన్నారు. మెగా డీఎస్సీపై చర్చకు సమయం కేటాయించాలని డిమాండ్ చేశారు. బీఏసీలో చర్చించి ఏయే అంశాలు చర్చకు పెట్టాలో నిర్ణయించాలని ఛైర్మన్ మోషేన్‌రాజు సూచించారు. వైకాపా సభ్యుల నినాదాల మధ్య సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు.

## వెంకయ్యనాయుడిని ఆదర్శంగా తీసుకోండి

**సామాన్యుడిగా వచ్చి..అసామాన్యుడిగా ఎదిగారు**

**కార్యకర్తలకు బిజెపి అధ్యక్షుడు నబీన్ హితోక్తి**

విశాఖపట్నం,ఆగస్ట్18 : కార్యకర్త నుంచి జాతీయ నాయకుడిగా ఎదిగిన భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పోరాటాల స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని బీజేపీ శ్రేణులకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే బీజేపీ అతి పెద్ద పార్టీగా ఉందని అన్నారు. దేశాన్ని మరింత శక్తిమంతంగా చేయడానికి సంకల్పం తీసుకోవాలని ప్రతి కార్యకర్తకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో మంచి పాలన అందుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమికి మంచి విజయాన్ని అందించిన ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించడానికి కూటమి ఏర్పాటైందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై ప్రధాన మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారని గుర్తు చేశారు. తమ కలలను సాకారం చేసే పార్టీని ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. అనేక ప్రాజెక్టులు ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి డబల్ ఇంజిన్ సర్కార్ పని చేస్తుందని అన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. విపక్షం కాంగ్రెస్ పార్టీ అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తుందని మండిపడ్డారు. దీనిని తిప్పి కొట్టాలని బీజేపీ శ్రేణులకు సూచించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతారహిత్యంగా ప్రధాని మోదీపై వ్యాఖ్యలు చేస్తున్నారని గుర్తు చేశారు. వాటిని ఖండించాలని పార్టీ శ్రేణులకు బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యల్లో నిరాశ కనపడుతోందని వ్యాఖ్యానించారు. విపక్షం వాడే భాష.. దేశాన్ని అస్థిర పరిచేలా ఉందన్నారు. దేశం ముందుకెళ్తుంటే సహించలేక పోతున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల వైఖరిని ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. ప్రస్తుత రాజకీయాల్లో విపక్షాలు, పార్ట్ టైం నాయకుల్లా తయారయ్యారని వ్యంగ్యంగా అన్నారు. యువతను ప్రభుత్వం మీద రాళ్లు విసిరేందుకు వాడితే.. మనం దేశ నిర్మాణానికి వాడుతున్నామని చెప్పారు. దేశంలోని యువతతో మమైకం కావాలని ఈ సందర్భంగా పార్టీ కేడర్‌కు సూచించారు. బీజేపీ జాతీయ వాదంతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. అన్ని వర్గాల వద్దకు వెళ్లి పార్టీని ముందుకు తీసుకెళ్లి.. బలోపేతం చెయ్యాలని పార్టీ శ్రేణులను ఆయన దిశానిర్దేశర చేశారు. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రాప్రదేశ్ దిశగా పనిచేయాలని శ్రేణులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీలో ఈ ఏడాదిలో జరిగిన అభివృద్ధిపై పుస్తకాన్ని జాతీయ బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ ఆవిష్కరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ జాతీయ కమిటీలో పదవులు పొందిన దగ్గుబాటి పురందేశ్వరి, విష్ణువర్ధన్ రెడ్డిని ఈ సందర్భంగా నితిన్ నబిన్ సన్మానించారు.

## బీసీలకు రాజకీయ సాధికారత

**రిజర్వేషన్ల కల్పన గొప్ప నిర్ణయం**

**ఐటిశాఖ మంత్రి లోకేశ్ వెల్లడి**

అమరావతి,ఆగస్ట్18 : బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడంతో పాటు స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించిందని లోకేశ్ తెలిపారు. అలాగే పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు ఈ నిర్ణయం గొప్ప అవకాశంగా మారుతుందని మంత్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల భాగస్వామ్యం పెరగడం ద్వారా నిర్ణయాధికారంలో వారికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు అండగా నిలుస్తోందని నారా లోకేశ్ అన్నారు. బీసీల సంక్షేమం, రాజకీయ సాధికారత కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. 'ప్రజా ప్రభుత్వం బీసీలకు జై కొట్టింది.. జయహో బీసీ అంటోంది' అని లోకేశ్ పేర్కొన్నారు. ఏపీ పంచాయతీరాజ్ చట్టం?1994కు అనుగుణంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ముఖ్యమైన అంశమని మంత్రి వివరించారు. నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో మేయర్లు, చైర్మన్లను ఇకపై ప్రత్యక్ష ఎన్నికల విధానంలో ఎన్నుకునేలా నిర్ణయం తీసుకున్నట్లు లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రస్తుత 13 జిల్లా పరిషత్‌లను 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్వాగతించారు. ఇది బీసీల సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత దిశగా మరో కీలక అడుగని పేర్కొన్నారు. 34 శాతం రిజర్వేషన్‌తో లక్షలాది బీసీ కుటుంబాల చిరకాల స్వప్నాలు సాకారం కానున్నాయని అన్నారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు టీడీపీ బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. బీసీల హక్కులను కాపాడటమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలను వంచించిందని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జగన్ మోసం చేశారని పల్లా శ్రీనివాసరావు విమర్శించారు.

## మైనింగ్ క్వారీ ప్రమాదం కేసు

**అనుకూల నివేదిక కోసం లంచం డిమాండ్**

**మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అరెస్ట్**

అమరావతి,ఆగస్ట్18 : ప్రకాశం జిల్లాలో మైనింగ్ క్వారీలో జరిగిన ప్రమాదం కేసులో అనుకూల నివేదిక కోసం లంచం డిమాండ్ చేసిన వ్యవహారంలో పలువురి ప్రమేయం ఉన్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. అలాగే ప్రైవేట్ మైనింగ్ సంస్థ ప్రతినిధి, కన్‌స్టలెంట్‌ను అరెస్ట్ చేశారు. వీరిని విజయవాడ కోర్టులో హాజరుపరచనున్నారు. గతంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు రూ. లక్ష లంచం ఇచ్చినట్లు కూడా సీబీఐ గుర్తించింది. అనుకూల నివేదికతో పాటు మైనింగ్ సంస్థ నుంచి త్రైమాసిక లంచాల కోసం రూ. 2 లక్షలు ఏర్పాటు చేసినట్లు కనుగోంది. మైనింగ్ క్వారీ ప్రమాదంలో అనుకూల నివేదిక కోసం రూ. 2 లక్షల నగదు తీసుకుంటూ డిప్యూటీ డైరెక్టర్‌ను సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సంగతి తెలిసిందే. సందర్భంగా ఆ నగదును సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒంగోలు, కడప, హైదరాబాద్‌లలో నిందితులకు చెందిన ఇళ్లలో కూడా సీబీఐ సోదాలు చేపట్టింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

## పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం

**మెరుగైన ధర లభించేలా కృషి: అచ్చన్న**

అమరావతి,ఆగస్ట్18 : పొగాకు రైతులకు మెరుగైన ధర లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు వెల్లడించారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లలో సానుకూల పురోగతి సాధించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 117 వేలాలు పూర్తి.. సుమారు 60 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం ఎఫ్‌సీవీ పొగాకు సగటు ధర కిలోకు సుమారు రూ.210గా ఉందని పేర్కొన్నారు. ఇటీవలి రోజుల్లో రోజుకు 1.5 నుంచి 2 మిలియన్ కిలోల వరకు పొగాకు అమ్మకాలు జరుగుతున్నాయని వివరించారు. కొనుగోళ్ల వేగం పెరగడం.. 'నో-బిడ్' శాతం క్రమంగా తగ్గడం మంచి పరిణామం అని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. పొగాకు కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో మరోసారి చర్చించామని తెలిపారు. కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని కంపెనీలు, ట్రేడర్లకు ఇప్పటికే స్పష్టమైన సూచన చేశామని వివరించారు. నో-బిడ్స్'ను మరింత తగ్గించి రైతుల వద్దనున్న పొగాకు వేగంగా కొనుగోలు చేయాలని అధికారులను ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. రైతులకు లభించే సగటు ధర మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని కూడా కోరినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి లక్షల కోట్ల ఆస్తులు

హైదరాబాద్,ఆగస్ట్18 : హైదరాబాద్‌లో లక్షల కోట్ల విలువైన ప్రజల ఆస్తులకు రేవంత్‌రెడ్డి సర్కారు '22-ఎ' తో సంకెళ్లు వేసిందని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. సామాన్యుల ఆస్తులను, దశాబ్దాలుగా ఉంటున్న కాలనీలను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి నెట్టి, సామాన్యుడి కాళ్ల కింద నేలను లాక్ చేశారని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్రావు, వినోద్, సత్యవతి రాథోడ్ తదితరులు మాట్లాడారు.ఆస్తులు అమ్ముకోలేక, కనీసం బ్యాంకులో కుదువపెట్టి అప్పు తెచ్చుకోలేక ప్రజలు విలవిల్లాడుతున్నారని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ప్రజల ఆస్తులను బందీ చేసిన ఈ తుగ్లక్ ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.




# డిసి చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు

తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ.85 కోట్ల వసూళ్లను సాధించి, రూ.100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా ఉంటుందని' బన్నీ అభివర్ణించారు. ఇక దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైల్‌కు తాను ఫిదా అయ్యానని తెలుపుతూ, చిత్ర బృందం మొత్తానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును అబ్సల్యూట్ మాస్టర్ బూస్టర్‌గా బన్నీ అభివర్ణించారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కిందని ఆయన పేర్కొన్నారు. నటీనటుల విషయానికి వస్తే, వామికా గబ్బి నటన అద్భుతమని మెచ్చుకుంటూనే, ప్రధాన పాత్రలో హీరోగా నటించిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ నటనను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన మిత్రుడు లోకేష్ కనగరాజ్ తనకు ఎల్లప్పుడూ ఒక గొప్ప మద్దతుగా ఉంటారని అల్లు అర్జున్ సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన కొద్ది కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతూ, సినీ వర్గాల్లో 'డీసీ' మూవీ హాట్ టాపిక్‌గా మారింది.








# ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్

### రామ్‌చరణ్ గెస్ట్ రోల్ ప్రచారాలను ఖండించిన టీమ్

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.




# అక్టోబర్ 2న రానున్న సందీప్ కిషన్ సిగ్మా

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవు తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇకపోతే ఈ సినిమాలో అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సినిమాలో 'మ్లలెపూల పల్లకి బంగారు పల్లకి' అంటూ సాగే పాటలో రామ్ చరణ్ అయ్యప్ప మాలధారణలో కనిపిస్తారని.. కొన్ని పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిపై రామ్‌చరణ్ టీమ్ తాజాగాం స్పందించింది. అవి రూమర్స్ అంటూ ఖండించింది. అసత్యాలను ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేసింది.

# జీ5లో స్ట్రీమింగ్ కానున్న జననాయకుడు

కోలీవుడ్ స్టార్ హీరో, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' తెలుగులో 'జన నాయకుడు' డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ పొలిటికల్ థ్రిల్లర్ సినిమా త్వరలోనే ఓటీటీ ప్రేక్షకులను అలరించనుంది. సెన్సార్ సమస్యలు మరియు వివిధ కారణాల వల్ల పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఎట్టకేలకు జూలై 23న థియేటర్లలో విడుదలైంది. థియేట్రికల్ రన్ పూర్తి చేసుకున్న ఈ మూవీని ప్రముఖ డిజిటల్ ఎ÷-లాట్‌ఫామ్ జీ5 (జిఇఇ5) సంస్థ అధికారికంగా ఓటీటీలోకి తీసుకువస్తోంది. ఆగస్టు 21వ తేదీ నుంచి ఈ సినిమా జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక వెల్లడించారు మేకర్స్. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ భాషలలో ఒకేసారి ఈ డిజిటల్ ప్రీమియర్ అందుబాటులోకి రానుంది. అయితే, హిందీ వెర్షన్ మాత్రం కొద్ది వారాల తర్వాత స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో పూజా హెగ్డే, మమిత బైజు, బాబీ డియోల్, ప్రకాష్ రాజ్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు.




# సంక్రాంతి బరిలో మెగా 158 మూవీ

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బ్జడెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్–శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com